PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 314 | విజయవాడ, బుధవారం 19 జూన్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 19 June 2024 | Rs

అదంతా ఓ నాటకం

- రాజ్యాంగాన్ని మోడీ ముఖానికి అద్దుకోవడంపై దుష్యంత్ దవే

• లోపలి పేజీలో..•

అందరి దృష్టి అమెరికాపైనే..

- దక్షిణాఫ్రికాతో కీలకపోరు
- నేటినుంచి సూపర్-8 పోటీలు

6

కించిత్ నిర్లక్ష్యం వున్నా సహించొద్దు

• నీట్ స్కాంపై కేంద్రానికి, ఎన్‌టిఎకు తేల్చి చెప్పిన సుప్రీం • తప్ప జరిగితే ఒప్పకోవాల్సిందే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నీట్ కుంభకోణంపై సుప్రీం కోర్టు మరోసారి సీరియస్ అయింది. నిర్లక్ష్యం .001శాతం ఉన్నా అందుకుబాధ్యులైనవారిని వదలకూడదని చెప్పింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వాన్ని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని ఆదేశించింది. ఈ కుంభకోణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లన్నింటినీ కలిపి జులై 8న విచారించనున్నట్లు సుప్రీం వెకేషన్ బెంచ్ ఇదివరకే తెలిపింది. నీట్ స్కాంపై దేశవ్యాపితంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు పెద్దయెత్తున ఆందోళనలకు దిగుతుండడం, ఇంతవరకు అక్రమాలే జరగలేదని బుకాయిస్తూ వచ్చిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు అక్రమాలు జరిగిన మాట నిజమే కానీ, అవి చాలా చిన్నవి అంటూ మసిపూసి మారేడుకాయ చేసేందుకు యత్నిస్తున్న తరుణంలో సుప్రీం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నీట్ పరీక్షలో కించిత్ నిర్లక్ష్యం ఉన్నా సహించరాదని సుప్రీం గట్టిగా నొక్కి చెప్పింది. ఈ విషయంలో మెతక వైఖరి ఎంతమాత్రమూ పనికిరాదని తేల్చి చెప్పింది. మంగళవారం నాడు జస్టిస్ ఎస్.వి.భట్టి ఎన్‌టిఎ తరపు న్యాయవాదులనుద్దేశించి ఇలా అన్నారు.. "మీరు (ఎన్‌టిఎ) స్పష్టమైన, ధృఢమైన వైఖరి తీసుకోవాలి. ఒకవేళ ఎక్కడన్నా తప్పు జరిగితే జరిగిందని మీరు ఒప్పుకోండి. మేం చర్యలు తీసుకుంటాం. కనీసం అప్పుడైనా మీ పనితీరు పట్ల విశ్వాసం కలుగుతుంది" అని చెప్పారు. 'వ్యవస్థను మోసం చేసి ఒక వ్యక్తి డాక్టర్ అయ్యాడనుకుందాం. ఏమవుతుంది. సమాజానికి చేటు జరుగుతుంది.' అని జస్టిస్ భట్టి వ్యాఖ్యానించారు. నీట్ పరీక్షల కోసం నిజాయితీగా లక్షలాదిమంది పిల్లలు సిద్ధమవుతూ వుంటారని, ఇలా మోసాలు జరిగితే వారి కృషి, ఆశలన్నీ భగ్నమవుతాయని అన్నారు. ఈ పరీక్ష కోసం పిల్లలు ఎంతలా కఠోర శ్రమ చేస్తారో మనందరికీ తెలుసునని అన్నారు. వెకేషన్ బెంచ్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ విక్రమ్‌నాథ్ కూడా ఇదే విధంగా స్పందించారు. అంతకుముందు ఎన్‌టిఎ, కేంద్రం తరపు న్యాయవాది కానూ అగర్వాల్ మాట్లాడుతూ, సుప్రీంలో దాఖలైన పిటిషన్లపై తమ స్పందన తెలియజేయడానికి ముందుగానే ఎన్‌టిఎ, కేంద్ర ప్రభుత్వాలపై ప్రతికూల నిర్ధారణకు రావద్దని న్యాయమూర్తులను కోరారు. ఈ పరీక్షల కోసం పిల్లలు ఎంత కష్టపడతారో తమకు తెలియంది కాదన్నారు. పిల్లలు ఎదుర్కొనే ఇబ్బందులు, కష్టాల గురించి కోర్టు వెలుపల చర్చించామన్నారు. దీనిపై జస్టిస్ భట్టి ప్రతిస్పందిస్తూ, ఇప్పుడు కావాల్సిందల్లా తప్పు ఏమైనా జరిగిందా అని నిజాయితీగా పరిశీలించడమని అన్నారు. నీట్ వివాదాన్ని గమనంలోకి తీసుకోవాల్సిందిగా కోరుతూ రెండు పిటిషన్ల ద్వారా 30మందికి పైగా అభ్యర్థులు సుప్రీం ను ఆశ్రయించిన నేపథ్యంలో ఈ విచారణ జరిగింది. జూన్ ఆరంభంలో ఫలితాలు వచ్చినప్పటి నుండి ఇటువంటి అభ్యర్థనలు చాలానే కోర్టుకు అందాయి. జులై 6న కౌన్సెలింగ్ ప్రారంభం కావడానికి ముందే దర్యాప్తు నివేదికను తమకు అందజేయాల్సిందిగా పిటిషనర్లు కోర్టును కోరారు. రెండు వారాల్లోగా దీనిపై స్పందన తెలపాలని జస్టిస్ విక్రమ్ నాథ్ కేంద్రానికి, ఎన్‌టిఎకు నోటీసులు జారీ చేశారు.

దేశవ్యాప్తంగా ఎంబిబిఎస్, బిడిఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్ యుజి-2024 పరీక్షల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. నీట్ పరీక్షను గత మే 5న దేశవ్యాప్తంగా ఉన్న 4,750 కేంద్రాల్లో నిర్వహించగా, 24 లక్షల మంది హాజరయ్యారు. జూన్ 14న ఫలితాలు వెలువడతాయని తొలుత పేర్కొన్నప్పటికీ, సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ నాలుగునే వీటినీ ప్రకటించారు.బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ప్రశ్నాపత్రం ముందుగానే లీక్ అయిందని, పలుచోట్ల అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఎంబిబిఎస్, ఇతర కోర్సుల్లో అడ్మిషన్ కోసం పరీక్షలు రాసిన 1,563 మంది అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను రద్దు చేస్తామని, వారికి తిరిగి జూన్ 23న పరీక్ష నిర్వహిస్తామని సుప్రీం కోర్టుకు గత వారం తెలియజేశాయి.

రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటా రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 25న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు జులై 2 తుది గడువు కాగా, ఉపసంహరణకు అదే నెల 5 వరకు గడువు ఉంది. జులై 12న పోలింగ్, అదే రోజు ఫలితాలు వెల్లడికానున్నాయి. వైసిపి నుంచి టిడిపిలో చేరిన సి రామచంద్రయ్య, షేక్ ఇక్బాల్‌పై మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ అనర్హత వేటు వేసిన నేపథ్యంలో ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నిక జరగనుంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 164 సీట్లు టిడిపి, జనసేన, బిజెపి కూటమి గెలవడంతో ఈ రెండు స్థానాలు కూటమి అభ్యర్థులకు దక్కుతాయి.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ భేటీ

- పోలవరం, నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చ

5 లక్షల మంది వలసవాసులకు పౌరసత్వం

- ఎన్నికల ముంగిట బైడెన్ కొత్త ప్రణాళిక

• లోపలి పేజీలో..•

'మెగా'నా...'మినీ'నా!

- అమరావతి ఎలా?
- ప్రభుత్వం ముందు పలు ప్రతిపాదనలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిని ఎలా అభివృద్ధి చేయాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రతిపాదనలు పరిశీలిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం వీటిలో ఒకటి మెగా కార్పొరేషన్ చేయాలన్న ప్రతిపాదన! సిఆర్‌డిఎను అలాగే ఉంచి, దానిలో విడివిడిగా మిని స్థానిక సంస్థలను అభివృద్ధి చేయడం మరొకటి. దీనిలో భాగంగా ప్రస్తుతమున్న మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను రద్దు చేసి, విడివిడి మున్సిపాల్టీలుగా ఏరాటుచేయడం, వీటితో పాటు, రాజధాని ప్రాంతంలో కొన్ని పంచాయతీలను కూడా కొనసాగించాల్సిఉంటుంది. పంచాయతీలు ఉండటం వల్ల రియల్ ఎస్టేట్ అభివృద్ధికి, నిర్మాణ పనులు వేగంగా జరగడానికి వీలవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీటిలో దేనివైపు ప్రభుత్వం మొగ్గుచూపుతుందో చూడాల్సిఉంది.

'మెగా' ఇలా...

ఇప్పటి వరకు రాజధాని ప్రాంతంలో 29 గ్రామాలు మాత్రమే ఉన్నాయి. వీటికి అనుబంధంగా మరికొన్ని ప్రాంతాలను కలిపి కార్పొరేషన్‌గా మార్చితే కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా వీలైనంత ఎక్కువ నిధులు పొందవచ్చన్నది ఒక వాదన. ఫలితంగా ప్రజలకు త్వరితగతిన మౌలిక సదుపాయల కల్పనకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తెరపైకి తెచ్చింది. దీని గురించి విస్తృత ప్రచారం చేస్తూనే 2020లో మంగళగిరి, తాడేపల్లి మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించకుండా ఈ రెండు పట్టణాలతోపాటు దాదాపు 20 గ్రామాలను కలిపి మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ (ఎంటిఎంసి)గా ప్రతిపాదనలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కొంతమంది టిడిపి నాయకులు కోర్టుకెళ్లారు. కోర్టు స్టే ఇవ్వడంతో మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థకు ఎన్నికలు జరగలేదు. ఆ తర్వాత రాజధాని గ్రామాలను కలిపి ఒకసారి, కేవలం తుళ్లూరు మండలంలోని 19 పంచాయతీలను కలిపి మరోసారి మున్సిపాల్టీగా చేసేందుకు వైసిపి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చి గ్రామపంచాయతీల్లో ప్రజాభిప్రాయసేకరణ చేసింది. దీనిని కూడా రాజధాని రైతులు వ్యతిరేకించారు. ఈ ఉత్తర్వులపై కూడా కోర్టు స్టే విధించింది. రాజధానిలో కీలకమైన తుళ్లూరు మండలంలో టిడిపి బలంగా ఉండడంతో వైసిపి ప్రభుత్వం ఇక్కడ ఎటువంటి ఎన్నికలూ నిర్వహించలేదు. మున్సిపల్ పట్టణాల మార్పునకు ప్రయత్నిస్తూ నాలుగేళ్లపాటు కాలయాపన చేసింది. మొత్తంమీద మంగళగిరి, తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లో గత ఆరేళ్లుగా ఎన్నికలు జరగలేదు. ఇప్పుడు మూడు మండలాలను కలిపి మెగా కార్పొరేషన్‌గా మార్చితే టిడిపికి పూర్తి అనుకూలత ఏర్పడుతుందని పలువురు నేతలు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మండలాల్లో దాదాపు మూడున్నర లక్షల జనాభా ఉంటుందని అంచనా. విజయవాడ, గుంటూరు మధ్యలో మరొక గ్రేటర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని కొందరు అధికారులు అంచనా వేస్తున్నారు. రాజధాని ప్రాంతం ఒకే నగరపాలక సంస్థ కింద ఉండడం కూడా ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

'మినీ ...' ఎందుకంటే...?

మెగా నగర పాలక సంస్థ కన్నా విడివిడి మున్సిపాల్టీలు, పంచాయతీల ఏర్పాటే మేలన్నది మరో అభిప్రాయం. నగర పాలక సంస్థల్లో రియల్ ఎస్టేట్ విస్తరణ అంత సులభం కాదని, అనేక నిబంధనలు అడుపడుతాయన్న వాదన వినిపిస్తోంది. నిర్మాణాలకు అనుమతులు రావడం కూడా కష్టమవు తుందని చెబుతున్నారు. పంచాయతీల్లో మిగతా 2లో

పిఎం కిసాన్ సభలో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, యుపి సిఎం ఆదిత్యనాథ్ తదితరులు

పిఎం కిసాన్ నిధులు విడుదల

- వారణాసిలో అట్టహాసంగా కార్యక్రమం
- ఇచ్చేది గోరంత...ప్రచారం కొండంత

వారణాసి : పిఎం కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత నిధులను ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం నాడిక్కడ విడుదలజేశారు. ఎన్నికల తరువాత వారణాసి నియోజకవర్గంలో తొలిసారిగా పర్యటించిన ఆయన రొటీన్‌గా జరిగేఈ నిదుల విడుదల కార్యక్రమాన్ని ఇక్కడ అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మోడీ మాట్లాడుతూ, 9.26 కోట్ల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూర్చేలా రూ.20వేల కోట్లు విడుదల జేస్తున్నామన్నారు.కొత్త ప్రభుత్వం తీసుకున్న తొలి నిర్ణయం రైతులు, పేదలకు సంబంధించినదని చెప్పుకున్నారు. కాశీ విశ్వనాధుడు, గంగా మాత ఆశీస్సులతో, కాశీ ప్రజల ప్రేమాభిమానాలతో ఈ దేశానికి సేవ చేయడానికి మూడోసారి ప్రధాన సేవకుడిగా వచ్చానని మోడీ సెలవిచ్చారు. పద్దెనిమిదో లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు నిజంగా కనీవినీ ఎరుగనిదని, చరిత్ర సృష్టించిందని ఆయన అన్నారు. రైతాంగానికి ఆర్థికంగా చేయూత అందించేందుకు ఐదు సంవత్సరాల క్రితం మోడీ ప్రభుత్వం ప్రారంభించిన పథకం పిఎం-కిసాన్. దీని కింద ఒక్కో విడతలో రెండు వేల రూపాయల చొప్పున సంవత్సరానికి మూడు మిగతా 5లో

అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా దమ్మాలపాటి శ్రీనివాస్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి ఓటమిపాలవడంతో ఆ ప్రభుత్వంలోని అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. దమ్మాలపాటి శ్రీనివాస్ గత తెలుగుదేశం ప్రభుత్వంలోనూ 2016 నుంచి 2019 వరకు రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. 2019 నుంచి 2024 వరకు వైసిపి ప్రభుత్వ హయాంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపైనే కాకుండా తనపైనా, తన కుటుంబ సభ్యులపైనా అమరావతి రాజధాని భూముల విషయంలో బనాయించిన కేసులను దమ్మాలపాటి శ్రీనివాస్ వాదించారు. ఈ నేపథ్యంలో దమ్మాలపాటి శ్రీనివాస్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి అవకాశం కల్పించారు.

సర్టిఫికెట్లపై రాజముద్ర

పథకాల పేర్లు మార్పు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాలశాఖ జారీ చేసే సర్టిఫికెట్లపై ఇకపై రాజముద్ర తప్పనిసరి అని ఆ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబరు 4ను జారీ చేసింది. ఎలక్షన్ కోడ్ సమయంలో సచివాలయాలకు సరఫరా చేసిన హైసెక్యూరిటీ పేపర్లను మాత్రమే ప్రస్తుతం ఉపయోగించాలని అందులో పేర్కొంది. 2019-24 మధ్య కొనసాగించిన ప్రభుత్వ పథకాల పేర్ల స్థానంలో 2019కు ముందు ఉన్న పేర్లు ఉండేలా మార్పు చేయాలని సూచించింది. 2019-24 మధ్యలో ప్రారంభమైన కొత్త పథకాల పేర్లను వెంటనే తొలగించి, కొత్తగా పేర్లు పెట్టే వరకు వాటికి సాధారణ పేరును మాత్రమే ఉపయోగించాలని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్, పాస్‌పుస్తకాలు, లబ్ధిదారుల కార్డులు, ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయబడిన సర్టిఫికెట్లపై పార్టీ జెండాలకు సంబంధించిన రంగులు ఉన్నట్లయితే వాటిని వెంటనే నిలిపివేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

పథకాల పేర్లు మార్చినవి

2019 - 2024 స్కీమ్ పేరు	మార్పు
జగనన్న విద్యాదీవెన	పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ (ఆర్‌టిఎఫ్)
జగనన్న వసతి దీవెన	పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ (ఆర్‌టిఎఫ్)
జగనన్న విదేశీ విద్యా దీవెన (ఎస్‌సిలకు)	అంబేద్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి (ఎఒవిఎన్)
వైఎస్‌ఆర్ కళ్యాణ మస్తు	చంద్రన్న పెళ్లి కానుక
వైఎస్‌ఆర్ విద్యోన్నతి	ఎన్‌టిఆర్ విద్యోన్నతి
జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం (జెసిఎస్‌పి)	ఇన్సెంటివ్స్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్

బహుముఖ ప్రజ్ఞాశాలి ఎంహెచ్

- 23వ వర్ధంతి సభలో వి శ్రీనివాసరావు

2

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'ప్రజాశక్తి' వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు -2024 కోసం ప్రజాశక్తి సాహితీ సంస్థ ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. పాత్రికేయ రంగంలో విశేషంగా కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు కోవిడ్ కాలంలో మినహా ప్రతియేటా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్టు సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవిఎస్ శర్మ మంగళవారం నాడిక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసరు జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన అవార్డు ఎంపిక కమిటీ సూచన మేరకు **ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను** ఎంట్రీలుగా ఆహ్వానిస్తున్నామన్నారు. 2023 మే ఒకటి నుంచి 2024 జూన్ 18 వరకు తెలుగు దినపత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే ఎంట్రీలుగా పంపాలని, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఇందులో పాల్గొనవచ్చని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల వార్తా కథనాలను ఎవరైనా సూచించవచ్చని ఆ ప్రకటనలో కోరారు. ఎంట్రీతో పాటు ఇది నా సొంతరచన, ఎవరినీ అనుకరించినది కాదని స్వీయ ధ్రువీకరణ పత్రం జత చేసి పంపాల్సి ఉంటుందన్నారు. **ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేటట్లు పంపాలి**, కవర్‌పై ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు -2024 కోసం అని స్పష్టంగా పేర్కొనాలని ఆ ప్రకటనలో కోరారు. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చున్నారు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుందన్నారు. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా :

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501,
ఇ మెయిల్ అడ్రస్:
psmhaward@gmail.com

భయపెడుతున్న ఇళ్ల అద్దెలు

- ఐదేళ్లలో 64% పెరుగుదల
- అనరాక్ రిపోర్ట్

న్యూఢిల్లీ : ప్రజల ఆదాయాల్లో పెరుగుదల లేకపోయినప్పటికీ.. నివాస అద్దెలు మాత్రం నింగిని అంటుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో అద్దెలు 64 శాతం పెరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ అనరాక్ వెల్లడించింది. 2019 నుంచి దేశంలో వేగంగా అద్దెలు పెరిగాయని తెలిపింది. అనరాక్ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని ఢిల్లీ-ఎన్‌సిఆర్, ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), చెన్నయ్, కోల్‌కత్తా, పూణె, హైదరాబాద్, బెంగళూరు తదితర ఏడు ప్రధాన నగరాల్లో 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రెండు పడక గదుల ఇంటి అద్దెలు భారీగా ఎగిశాయి.

దేశ రాజధాని సమీపంలోని నేషనల్ కాపిటల్ రీజియన్ (ఎన్‌సిఆర్)లో 2018-19లో రూ.15,500గా ఉన్న సగటు అద్దె.. గడిచిన 2023-24 నాటికి 63.3 శాతం పెరిగి రూ.25,000కు చేరింది. దక్షిణ ఢిల్లీలో అద్దెలు 43.5 శాతం పెరిగి రూ.19,500 నుంచి రూ.28,000కు చేరాయి.

ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్‌లోని చెంబూర్‌లో రెండు పడక గదుల ఇంటికి అత్యధికంగా రూ.63,500 సగటు అద్దె చోటుచేసుకుంది. ఇక్కడ 2019లో రూ.45,000గా ఉన్న అద్దెతో పోల్చితే 41.1 శాతం పెరుగుదల నమోదయ్యింది. బెంగళూరులోని సర్జాపూర్ రోడ్‌లో సగటు అద్దె రూ.35,000కు చేరింది. 2019లో ఇక్కడ అద్దె రూ.21వేలుగా ఉంది.

జూన్ త్రైమాసికంలో ఇలా..

ప్రస్తుత ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో ఇప్పటి వరకు నివాస గృహాల అద్దెల్లో 2-4 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మార్చి త్రైమాసికంలో 4-9 శాతం వరకు పెరిగాయని అనరాక్ రిపోర్ట్ పేర్కొంది. 2024 జూన్ త్రైమాసికం(క్యూ2)లో నోయిడా సెక్టార్ -150లో అద్దెలు సగటున 4 శాతం పెరగ్గా.. మార్చి త్రైమాసికంలో 9 శాతం పతనం చోటు చేసుకుంది. క్యూ2లో గూర్‌గావ్, ద్వారకలో అద్దెలు 3 శాతం, 2 శాతం చొప్పున పెరిగాయి. మార్చి త్రైమాసికంలో హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల అద్దెల్లో 5 శాతం పెరుగుదల ఉండగా.. జూన్ త్రైమాసికం అద్దెల్లో 3 శాతం పెరుగుదల నమోదైంది.

" జూన్ త్రైమాసికంలో సాధారణంగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో కొత్త సిబ్బంది నియామకం కారణంగా అద్దెలు ఇతర త్రైమాసికాల కంటే ఎక్కువగా పెరుగుతాయి" అని అనరాక్ గ్రూప్ వైస్ ఛైర్మన్ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది కొత్త నివాసాలు పెరుగుతున్న నేపథ్యంలో అద్దెల్లో తగ్గుదల ఉండొచ్చన్నారు. దేశంలోని ఏడు అతిపెద్ద నగరాలు 2024లో 5.31 లక్షల కొత్త యూనిట్లను డెలివరీ చేయబోతున్నాయని అనరాక్ అంచనా. ఇది 2023లో డెలివరీ చేయబడిన 4.35 లక్షల యూనిట్ల కంటే 22 శాతం ఎక్కువ. ఈ ఏడాది అత్యధిక యూనిట్లు ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్‌లో 1,60,900, ఆ తర్వాత ఎన్‌సిఆర్ పరిధిలో 1,44,397 యూనిట్లు, పూణెలో 97వేల చొప్పున నివాసాలు అందుబాటులోకి రానున్నాయని అనరాక్ అంచనా వేసింది.

ఉత్తర భారతంలో బానుడి భగభగలు

- బీహార్‌లో 22 మంది మృతి

న్యూఢిల్లీ : గరిష్ట స్థాయి ఉష్ణోగ్రతలతో ఉత్తర భారతం కుతకుతలాడుతోంది. చాలా చోట్ల 46 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్‌లో వడగాడ్పులు ఠారెత్తిస్తున్నాయి. దీంతో ఉత్తరాది ప్రాంతాల్లో భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఉత్తరాఖండ్, బీహార్, జార్ఖండ్‌లలోనూ వేడి విపరీతంగా పెరిగింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా బీహార్‌లో గత 24 గంటల్లో 22 మంది మరణించారు. ఉత్తర భారతంలో జూన్‌లో సాధారణంగా నమోదయ్యే ఉష్ణోగ్రతల కన్నా 6 డిగ్రీలు ఎక్కువగా నమోదయి నట్లు అధికారులు తెలిపారు. సోమ, మంగళవారల్లో ఢిల్లీలో ఉష్ణోగ్రత 50 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుందని భావిస్తున్నారు. బుధవారం నుంచి ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుముఖం పడతాయని ఐఎండి అంచనా వేస్తోంది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, పౌరీ, నైనిటాల్ వంటి హిల్ స్టేషన్లలోనూ ఉష్ణోగ్రతలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ గరిష్ట ఉష్ణోగ్రత 43.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. జమ్ముకాశ్మీర్‌లోని కత్రా, జమ్ముల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40.8, 44.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

వచ్చే నెలలో బడ్జెట్ భేటీలు

- మూడోవారంలో నిర్వహణ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వార్షిక బడ్జెట్ సమావేశాలను వచ్చే నెలలో నిర్వహించనున్నారు. జూలై మూడో వారంలో ఈ భేటీలను నిర్వహించనున్నట్లు ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. ఐదు నుంచి ఆరు రోజులపాటు ఈ సమావేశం జరిగే అవకాశ ఉందని సమాచారం. మార్చిలో జరిగిన ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్ సమావేశాల్లో తొలి నాలుగు నెలలకు శాసనసభ అనుమతిని తీసుకున్నారు. దీంతో తప్పనిసరిగా జూలైలోగా తుది బడ్జెట్‌ను ఆమోదించుకోవాల్సి ఉంటుంది. అందుకే వచ్చే నెలాఖరులోగా సమావేశాలను ముగించి సభ అనుమతి పొందాలని భావిస్తున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నేను పారిపోలేదు

- కెవివి సత్యనారాయణ వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తాను రాష్ట్రం విడిచి వెళ్లిపోయానన్న వదంతులు పూర్తిగా అవాస్తవాలని రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ చెప్పారు. మంగళవారం తన ఛాంబర్‌లోనే ఆయన ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ.. తనను రాష్ట్రం నుంచి రిలీవ్ చేయాలని ఈ నెల ఐదో తేదీన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశానని, తరువాత కూడా మరోసారి లేఖ రాసినట్లు వెల్లడించారు. అయితే తనను ఇంకా రిలీవ్ చేయలేదని వివరించారు. తాను ఎవరికీ చెప్పకుండా రైల్వేస్‌కు వెళ్లిపోయాననడం సరికాదన్నారు. ఇప్పటికీ ఆర్థికశాఖలోనే విధులు నిర్వహిస్తున్నానన్నారు. రాష్ట్రంలో తన డిప్యూటేషన్ ఏడేళ్లు పూర్తయిందని, ఇక రైల్వేస్‌కు వెళ్లిపోవాల్సి ఉంటుందని, లేని పక్షంలో తనపై ఇంక్రిమెంట్లు కోతల వంటి చర్యలు కూడా ఉంటాయన్న ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే తనను రిలీవ్ చేయడం గానీ, ఇక్కడే కొద్ది రోజులు కొనసాగిస్తున్నట్లు లేఖ ఇవ్వడంగానీ చేయాలని కోరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక అఖిలభారత సర్వీసు అధికారిగా తన బాధ్యతలను సక్రమంగా ఏడేళ్లుగా నిర్వహించానని సత్యనారాయణ వివరించారు.

ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బీమా పట్ల హర్షం

- ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రమాద బీమా పథకాన్ని అమలు చేసేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం పట్ల ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్), ఎంప్లాయిస్ యూనియన్లు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు మంగళవారం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, అయ్యపురెడ్డి, ఎపిఎస్‌ఆర్‌టిసి అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి తులసీరామ్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య వేర్వేరుగా హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ప్రమాద బీమాతోపాటు, రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందినపుడు ఇచ్చే మట్టి ఖర్చును రూ.25 వేలకు పెంచడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రమాద బీమా నిర్ణయంతో ఆర్‌టిసిలోని 7,300 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు థర్డ్‌పార్టీ విధానంలో వేతనం ఇచ్చే ప్రక్రియను రద్దుపరిచి, ఎపిఎస్‌ఆర్‌టిసినే నేరుగా వేతనాలు చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

యాత్రికుల రద్దీ పర్యవేక్షణకు ఎఇఒను నియమించాలి : ఇఒ

ప్రజాశక్తి - తిరుమల

యాత్రికుల రద్దీ అధికంగా ఉండి దాదాపు ఐదు కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉన్న క్యూ లైన్‌లను పర్యవేక్షించడానికి తక్షణమే ఒక అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఎఇఒ)ను ప్రత్యేకంగా నియమించాలని టిటిడి ఇఒ జె శ్యామలరావు ఆదేశించారు. టిటిడి రెవెన్యూ, పంచాయతీరాజ్, రిసెప్షన్, ఐటి విభాగాలపై ఆయన మంగళవారం సమీక్షించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ నరసింహకిషోర్‌లతో కూడిన ఆయాశాఖల అధిపతులు పాల్గొన్నారు. శ్రీవారి మెట్టు కాలిబాట మార్గంలో 1200 మెట్టు వద్ద దివ్యదర్శనం టోకెన్ల స్కానింగ్‌ను పునఃప్రారంభించాలని ఐటి విభాగానికి సూచించారు. టూరిజం కోటాలో ఎలాంటి దుర్వినియోగం జరగకుండా చూడాలని విజిలెన్స్‌కు ఆదేశించారు. తరచూ వసతి గృహాలు తీసుకుంటున్న దళారుల జాబితా సిద్ధం చేయాలన్నారు. నారాయణగిరి షెడ్డుల వద్ద వైకుంఠం కంపార్టుమెంట్ల మాదిరిగానే ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. తిరుమల స్థానికులకు కేటాయించిన ఇళ్లు, హోటళ్లు, వాణిజ్య దుకాణాలు, వాటి అద్దెలు, దోనర్ కాటేజీలకు సంబంధించి భూముల కేటాయింపు, ముడిసరకుల అనుమతుల గురించి ఇఒకు వివరించారు. అనంతరం ఇఒ అధికారులతో కలిసి జనతా క్యాంటీన్లు, హోటళ్లను తనిఖీ చేసి ప్రదర్శించిన ధరలను పరిశీలించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఎం.హెచ్

- మోటూరు హనుమంతరావు 23వ వర్థంతి సభలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన మోటూరు హనుమంతరావు అన్ని రంగాలపై సమగ్రమైన అవగాహన కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, ప్రజాశక్తి మాజీ సంపాదకులు వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మోటూరు హనుమంతరావు 23వ వర్థంతి కార్యక్రమం తాడేపల్లిలోని ప్రజాశక్తి భవనంలో జరిగింది. ఎంహెచ్ చిత్రపటానికి వి శ్రీనివాసరావు, ఎంహెచ్‌గారి అల్లుడు, ప్రజా వైద్యులు డాక్టర్ కె సుధాకర్, మనవడు డాక్టర్ నవీన్, ప్రజాశక్తి సంపాదకులు బి తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజరు వై అచ్యుత్‌రావు, సర్క్యులేషన్ జిఎం హరికిషోర్ తదితరులు పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడారు. అన్ని రంగాల్లోనూ సవ్యసాచిగా మోటూరు హనుమంతరావు ఆదర్శ కమ్యూనిస్టు అని కొనియాడారు. ఆయన ప్రజాశక్తిలో రాసిన సంపాదకీయాలు, రచనలు, బహిరంగ సభల్లో చేసిన ప్రసంగాలు చాలా స్ఫూర్తిదాయకంగా వుండేవన్నారు. ఆయన ధ్యాస పార్టీ అభివృద్ధి గురించే ఉండేదన్నారు. ఆయన ఉపన్యాసం గంభీరంగానూ, ఉత్తేజంగానూ చైతన్యం రగిలించేలా వుండేదన్నారు. సిపిఎం నిర్మాణం బలపడటంలో ఆయన చేసిన పోరాటం, పోషించిన పాత్ర అసాధారణమన్నారు. అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రజాశక్తి కార్యాలయంపై దాడి చేసి నిషేధిస్తే ఏ మాత్రం వెరవకుండా అజ్ఞాతంగా పేపర్‌పై చేతిరాతతో రాసి సమాచారన్ని పార్టీ శ్రేణులకు అందించే వారన్నారు. తెలుగు పేపర్లలో మొదట కంప్యూటర్ వాడింది ప్రజాశక్తిలోనేనని తెలిపారు. ఎంతో కష్టపడి పార్టీని నిలబెట్టడంతో పాటు ప్రజాశక్తిని బలంగా తయారుచేశారని అన్నారు. పార్టీలో చీలిక నేపథ్యంలో ఏ మాత్రం నిరాశ నిస్పృహలకు గురికాకుండా బలమైన వాదనతో పార్టీ విస్తరణకు విశేష కృషి చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. తొలుత డాక్టర్ కె సుధాకర్ మాట్లాడారు. మోటూరు హనుమంతరావు ఏ స్థాయిలో వున్నా చాలా నిరాడంబరంగా వుండేవారని తెలిపారు. సైకిల్‌పై కార్యాలయానికి వచ్చేవారని అన్నారు. రిక్షాపుల్లర్‌లతో కూడా ఆప్యాయంగా మాట్లాడేవారని అన్నారు. ప్రతి ఒక్కరినీ సమదృష్టితో చూసే గొప్ప నాయకుడు, మానవతావాది అని కొనియాడారు. డాక్టర్ నవీన్ మాట్లాడుతూ తాతగారితో తమకున్న అనుబంధాన్ని, కార్యకర్తల పట్ల ఆయన చూపే ప్రేమాభిమానాలను వివరించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన బి తులసీదాస్ మాట్లాడుతూ మోటూరు హనుమంతరావు రాసిన వ్యాసాలు ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. కార్యకర్తలతో, సహచరులతో ఆయన మాట్లాడే తీరు, చూపించే వాత్సల్యం, ప్రేమ మరువలేనివన్నారు. సైద్ధాంతికపరంగా, రాజకీయపరంగా ఆయన స్పష్టత కలిగి దృఢచిత్తంతో వుండేవారని కొనియాడారు. మోటూరు హనుమంతరావు హయాంలోనే ప్రజాశక్తి తిరుపతి ఎడిషన్ ప్రారంభమైందన్నారు. ప్రజాశక్తి పత్రిక సాంకేతికంగానూ ముందడుగులో ఉందన్నారు. దేశంలో మొట్టమొదటగా యాపిల్ కంప్యూటర్లపై పేజినేషన్ చేసిన ఘనత ప్రజాశక్తికే దక్కిందన్నారు. ప్రజాశక్తి పత్రికను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు.

ఎంహెచ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వి శ్రీనివాసరావు, డాక్టర్ కె సుధాకర్, డాక్టర్ నవీన్, బి తులసీదాస్, వై అచ్యుతరావు

కార్యకర్తలను అవమానిస్తే తీవ్ర పరిణామాలు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గత ప్రభుత్వంలో అధికారులు తమపై కనీస గౌరవ, మర్యాదలు లేకుండా ప్రవర్తించారని, ఇప్పుడు అటువంటి వాటికి స్వస్తి పలకాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కార్యాలయాలకు వచ్చే ప్రజాప్రతినిధులను, ముఖ్యంగా తమ కార్యకర్తలను కలెక్టర్ నుంచి అటెండర్ వరకు గౌరవించాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహించాలని, సమావేశాల పేరుతో తప్పించుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. గతంలో ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లను, వైర్లను దొంగిలించుకుపోయారని, ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నా విడిచిపెట్టబోమని అన్నారు. టెక్కలిలోని పాత జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సుమారు రూ.50 కోట్ల విలువైన భూమిని ఒక ప్రయివేట్ వ్యక్తికి ఇచ్చేశారని, ఇందులో కలెక్టర్, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి, తహశీల్దార్ పాత్రపై నివేదిక ఇవ్వాలని, కలెక్టర్ ప్రమేయం ఉన్నా చర్యలు తప్పవన్నారు. తమ గ్రామం నిమ్మాడలో పిహెచ్‌సి ఏర్పాటు చేసినా తనకు గానీ, ఎంపికి గాని తెలియజేయకుండా కొండపై భవనం నిర్మించారని, దీనికి కలెక్టర్ అనుమతులు ఇచ్చారా? ఇతర అధికారులెవరైనా ఇచ్చారా? రాష్ట్రస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరుపయోగంగా మారిన భవన నిర్మాణ ఖర్చులను సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేస్తామన్నారు. విచారణ చేపట్టి ఒకరిద్దరు అధికారులను జైల్లో పెట్టకపోతే మిగిలినవారు కంట్రోల్‌లో ఉండరని అన్నారు.

అభివృద్ధి చెందిన దేశాల్లోనూ పేపర్ బ్యాలెట్లే

- ప్రజాస్వామ్య స్ఫూర్తి కొనసాగాలంటే మనమూ వాడాలి : జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇవిఎంలపై వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ట్వీట్ చేశారు. 'న్యాయం జరగడం ఒక్కటే ముఖ్యం కాదు.

జరిగినట్లు కనిపించాలి కూడా. అలాగే ప్రజాస్వామ్యం గెలవడంతోపాటు నిస్సందేహంగా గెలిచినట్లు కనిపించాలి కూడా. ప్రపంచం మొత్తమ్మీద ప్రజాస్వామ్యం కొనసాగుతున్న అత్యధిక దేశాల్లో ఎన్నికల ప్రక్రియ కోసం పేపర్ బ్యాలెట్లు వాడుతున్నారు. ఇవిఎంలు కాదు. ప్రజాస్వామ్యం అసలైన స్ఫూర్తిని కొనసాగించేందుకు మనం కూడా ఇదే దిశగా ముందుకు కదలాలి' అని ట్వీట్ చేశారు.

రేపు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో వైసిపి రాష్ట్రస్థాయి విస్తృతస్థాయి సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఓడిన ఎమ్మెల్యే అభ్యర్థులు, ఓడిన పార్లమెంటు అభ్యర్థులకు 22న పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనుందని సమాచారం చేరవేసిన ఆ పార్టీ.. తాజాగా 20వ తేదీనే సమావేశం జరగనున్నట్లు సమాచారం పంపింది.

జగన్ పులివెందుల పర్యటన వాయిదా

జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నుంచి ఈ నెల 21 వరకు వున్న పులివెందుల పర్యటన కూడా రద్దయ్యింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలోనే జగన్ పులివెందుల పర్యటన రద్దయినట్లు వైసిపి వర్గాలు తెలిపాయి.

ఉద్యోగులను అవమానించడం తగదు

ఉద్యోగుల పట్ల టిడిపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైందికాదని వైసిపి అధికార ప్రతినిధి రవిచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులపై వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు రాజమౌళి, కెవివి సత్యనారాయణ, వెంకయ్య చౌదరి, కల్నల్ అశోక్‌బాబు, సంధ్యారాణి, గురుమూర్తి, గుర్రాల శ్రీనివాస్, జాస్తి కృష్ణకిశోర్ వెంకటేశ్వర్లు, రమణారెడ్డిని డిప్యూటేషన్‌పై తెచ్చుకోలేదా? అని ప్రశ్నించారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ భేటీ

- పోలవరం, నామినేటెడ్ పోస్టులు భర్తీపై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం హోదాలో పవన్‌కల్యాణ్ , సిఎం చంద్రబాబుతో తొలిసారిగా మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక తొలిసారి సచివాలయానికి వచ్చిన పవన్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నాన్ని చూపించి మీరు ఆ గుర్తుకు హుందాతనం తెచ్చారని చంద్రబాబును ఉద్దేశించి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఇద్దరి మధ్య పోలవరం ప్రాజెక్టు గురించి , జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఫలితంగా రాష్ట్రం ఏ మేరకు నష్టపోయిందనే అంశంపై సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు పనులను ఎలా ముందుకు తీసుకెళ్ళాలి? కేంద్రం నుంచి ఎంతమేర సహాయం అందుతుంది? ఇందుకు సంబంధించిన అంశాలపై కీలకంగా చర్చ జరిగినట్లు సమాచారం. నామినేటెడ్ పోస్టుల భర్తీతో పాటు మంత్రివర్గ బేటీ, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ లాంటి అంశాలు చర్చించారు.

ఘన స్వాగతం పలికిన అమరావతి రైతులు

డిప్యూటీ సిఎం హోదాలో తొలిసారిగా వచ్చిన పవన్‌కల్యాణ్‌కు అమరావతి రాజధాని రైతులు ఘన స్వాగతం పలికారు. సీడ్ యాక్సెస్ రోడ్డులోకి పవన్ కాన్వాయ్ ప్రవేశించిన మొదలు సచివాలయం చేరే వరకు రోడ్డు కిరువైపులా రైతులు నిలబడి పూలు చల్లుతూ స్వాగతం పలికారు. గజమాలతో స్వాగతం పలికారు. వెంకటపాలెం నుంచి మందడం వరకు మహిళలు, అభిమానులు స్వాగత ర్యాలీ నిర్వహించారు. దారి పొడుగునా అభిమానులు, రైతులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పవన్ కల్యాణ్

డిప్యూటీ సిఎం కార్యాలయంగా నీటి పారుదల శాఖ అతిథిగృహం

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విజయవాడలోని నీటిపారుదల శాఖ అతిథి గృహాన్ని కేటాయించారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు చేరుకున్న వెంటనే తొలుత అతిథి గృహాన్ని ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయితో కలిసి పరిశీలించారు. రెండు అంతస్తుల ఈ గృహంలో పై అంతస్తులో నివాసం, దిగువ అంతస్తులో కార్యాలయం ఏర్పాటు చర్చించారు. ఈ కార్యక్రమంలో పవన్ వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ ఉన్నారు.

నేడు డిప్యూటీ సిఎంగా బాధ్యతల స్వీకరణ:

విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు డిప్యూటీ సిఎంగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయం పేర్కొంది.

సముద్రంలో ప్రమాదాలు

- ఒక బోటు దగ్ధం.. మరోబోటు బోల్తా
- సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

వేర్వేరు పడవ ప్రమాదాల్లో 11 మంది మత్స్యకారులు ప్రాణాలతో బయటపడ్డారు. విశాఖలో బోటు దగ్ధమైన ఘటనలో ఏడుగురు, ప్రకాశం జిల్లాలో బోటు బోల్తా పడిన ప్రమాదంలో నలుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. బాధితుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన గనగళ్ల అప్పయ్యమ్మకు చెందిన బోటులో ఏడుగురు మత్స్యకారులు నెల 15న విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లారు. అనకాపల్లి జిల్లా పూడిమడకకు సమీపంలో బోటులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పరిస్థితిని గమనించిన మత్స్యకారులు వాసుపల్లి రాజు, వాసుపల్లి అప్పన్న, వాచుపల్లి దాసీలు, వాసుపల్లి అప్పారావు, గనగళ్ల ఎరికొండు, మైలపల్లి ఎర్రయ్య, కనగళ్ల పోలిరాజు బోటు నుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నారు. బోటు దగ్ధం కావడంవల్ల రూ.30 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఫిషింగ్ హార్బర్ మెకానైజ్డ్ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ మీడియాకు తెలిపారు. సురక్షితంగా బయటపడ్డ మత్స్యకారులకు ఆశ్రయం కల్పించామన్నారు. ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు కొండూరి రాములు, చిట్టిబాబు, గోవిందు, కటారివారిపాలెం గ్రామానికి చెందిన కటారి శ్రీను సోమవారం సాయంత్రం బోటులో చేపల వేటకు వెళ్లారు. సముద్రంలో విపరీతమైన గాలులకు ఒక్కసారిగా బోటు బోల్తా పడింది. మత్స్యకారులు తేరుకునేలోపే వల, ఇంజన్లు, సిలిండర్, ఇన్వర్టర్, బ్యాటరీ లైట్స్, బోటు గల్లంతయ్యాయి. వల మూటలు, ప్లాస్టిక్ టిన్నులు, ఐస్ బాక్సుల సాయంతో సముద్రంలోనే ఐదు గంటలపాటు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని గడిపారు. అదే సమయంలో కనపర్తి గ్రామానికి చెందిన మేకల బాబు అనే మత్స్యకారుని బోటు అటువైపుగా వెళుండటాన్ని గమనించి పెద్దగా కేకలు వేశారు. గమనించిన బాబు వారి వద్దకు వెళ్లి బోటులో ఎక్కించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున వారంగా ఒడ్డుకు చేరుకున్నారు. వారిని గ్రామస్తులు పరామర్శించారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.6 లక్షలు నష్టం వాటిలినట్లు బాధితులు తెలిపారు.

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించండి

- ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం కోరింది. నూతనంగా రెవెన్యూశాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన అనగాని సత్యప్రసాద్‌ను మంగళవారం కలిసి ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అభినందించింది. ఈ సందర్భంగా ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి అంజి రాష్ట్రంలో విఆర్‌ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

రాష్ట్రంలో గత ఎనిమిదేళ్లుగా విఆర్‌ఎలకు వేతనాలు పెరగలేదని తెలిపారు. అలాగే విఆర్‌ఎలకు ఎన్నో ఏళ్లుగా అమలవుతున్న డిఎలను గత ప్రభుత్వం కట్ చేసి చిరుద్యోగులైన తమకు తీరని నష్టం చేసిందని వివరించారు. మీ సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ విఆర్‌ఎలకు హామీ ఇచ్చారు. మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన వారిలో ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు లక్ష్మణ్, వినాయకుడు, అంజి, రాఘవులు, నాగశేషుడు నాగేష తదితరులు వున్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

వేతనాలు చెల్లించాలని 'ఉక్కు' కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఉక్కు కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసే కుట్రలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేగవంతం చేస్తోందన్నారు. అందులో భాగంగానే కార్మికులకు వేతనాలు చెల్లించకుండా మానసికంగా హింసించాలని చూస్తోందని అన్నారు. ఎన్‌ఎసిఎస్ సమావేశంలో పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నాశనం చేయాలని చూస్తే కార్మికులు సహించబోరని హెచ్చరించారు. ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారం జోలికి ఎవ్వరూ రావొద్దని హితవు పలికారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసినప్పుడే ప్లాంట్ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. పోరాట కమిటీ కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో రాజకీయ పార్టీలు పని చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ చైర్మన్ ఎం రాజశేఖర్ మాట్లాడుతూ ఐక్య పోరాటాలతోనే ప్లాంట్‌ను రక్షించుకోగలమని తెలిపారు. ధర్నాలో నేతలు యు.రామస్వామి, వైటి.దాస్, కెఎస్‌ఎన్.రావు, పి.శ్రీనివాసరాజు, గణపతి రెడ్డి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పూర్తికి ప్రణాళిక

- ఐఅండ్‌పిఆర్, గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశించారు. విజయవాడలోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో గృహాలు నిర్మించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి? మౌలిక సదుపాయాలు కల్పించడానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ విభాగాల్లో సిబ్బందిని డిప్యూటేషన్‌లో తీసుకోవడం, ఉద్యోగ విరమణ చేసిన వారిని పౌర సేవల ద్వారా ఎవరెవరిని తీసుకున్నారు? అనే అంశాలపై నివేదికలు తయారు చేయాలన్నారు. ఆప్షన్-3 కింద నిర్మాణాలు చేపడుతున్న గుత్తేదారులతో సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

పౌరసరఫరాల శాఖలో అక్రమాలను గుర్తించాం

- బాధ్యులపై కేసులు తప్పవు : మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పౌరసరఫరాల శాఖలో అక్రమాలు జరిగినట్లు గుర్తించామని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ ఆటోనగర్‌లోని పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో మంగళవారం లీగల్ మెట్రాలజీ విభాగం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పులు చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో కూడా పెడతామని అన్నారు. రాష్ట్రంలోని 253 మండల లెవల్ స్టాక్ పాయింట్లలో నూటికి నూరు శాతం తనిఖీలు చేసి నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు 62 ఎంఎల్‌ఎస్ పాయింట్లలో తనిఖీలు పూర్తవ్వగా అందులో 24 చోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామన్నారు. కందిపప్పు, పంచదార, పామాయిల్ తూకాల్లో తేడాలు కనిపించాయన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. రెండు రోజుల కిందట తెనాలిలో మండల స్థాయి స్టాక్ పాయింట్లను తనిఖీ చేశామని, ప్రతి ప్యాకెట్‌లో 50నుంచి 80 గ్రాములు తూకం తక్కువ వచ్చినట్లు గుర్తించామన్నారు. అక్రమాలు ఏ స్థాయి వారు చేసినా వదిలే ప్రసక్తే లేదన్నారు. ధాన్యం అమ్ముకునే రైతులకు అన్యాయం జరగకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలి

- రాష్ట్రంలో మూతపడిన చెరకు ఫ్యాక్టరీలను తెరిపించాలి
- ఎఐకెఎస్ నాయకులు సాగర్

ప్రజాశక్తి - గుంటూరు

ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలని, రైతు రుణాలు రద్దు చేయాలని, విద్యుత్ బిల్లు వెనక్కి తీసుకోవాలని, రైతు సంఘాలకు రాతపూర్వకంగా ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం మోడీ ప్రభుత్వంపై మన పోరాటం కొనసాగించాల్సి ఉందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఉపాధ్యక్షులు టి.సాగర్ అన్నారు. రెండురోజులపాటు జరగనున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కెబి భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాగర్ మాట్లాడుతూ.. ఉత్తరాదిలో గంగామైదాన ప్రాంతాల్లో బిజెపిని ఓడించడంలో రైతు ఉద్యమం ముఖ్యమైన పాత్ర పోషించిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ సమస్యలు గత ప్రభుత్వ కాలం నుంచి కొనసాగుతున్నాయన్నారు. విభజన హామీలు అమలు కాలేదని, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉందన్నారు. కౌలు రైతులను గుర్తించాలని, భూ యజమానుల సంతకం ఉండాలనే నిబంధనలు తొలగించాలని, అన్ని రకాల ఉపకరణాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం కింద ఒక్కొక్క రైతుకు కేంద్రం విడుదల చేసిన రూ.2,000కు కూటమి ప్రకటించిన రూ.20,000 కలిపి వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో మూతపడిన చెరకు ఫ్యాక్టరీలను తెరిపించాలని, ధాన్యం రైతులకు బకాయిపడ్డ రూ.1600 కోట్లను వెంటనే ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు అన్ని రకాల ఉపకరణాలను అందించాలని, ఖరీఫ్ సీజన్‌కు సరిపడా విత్తనాలు, ఎరువులను ఆర్‌బికెల ద్వారా రైతులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పై సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20 నుంచి 30 వరకు రాష్ట్ర ప్రభుత్వానికి రైతు సంఘం ఆధ్వర్యంలో మెమోరాండం ఇవ్వాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు, రైతు సంఘం ఉపాధ్యక్షులు వై. కేశవరావు, మర్రాపు సూర్యనారాయణ, జిల్లాల రైతు నాయకులు పాల్గొన్నారు.

'మెగా'నా...'మినీ'నా!

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఆ సమస్య ఉండదని అందువల్ల అభివృద్ధి పనులు వేగంగా చేయవచ్చని అంటున్నారు. రాజధాని ప్రాంతంలో వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. ఈ మొత్తం ప్రాంతాన్ని మెగా నగరపాలక సంస్థగా మారిస్తే వీరి ఉపాధి సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 19 పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు నిలిపివేశారు. దీనిని ఇక్కడి వ్యవసాయ కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమకు ఉపాధి హామీ చట్టం కింద పనులు చూపాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. మొత్తం ప్రాంతాన్ని నగర పాలకసంస్థగా మారిస్తే మరో 20, 25 గ్రామాల్లో ఇదే పరిస్థితి ఏర్పడి, స్థానికంగా ఆందోళనలకు దారి తీసే అవకాశం ఉంది. ఆ పరిస్థితిని నివారించి ఉపాధి హామీ పనులు కొనసాగించేలా ప్రభుత్వ వ్యూహం ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలోనూ మార్పులు...

రాజధాని ప్రాంతానికి అమరావతి అన్న పేరు పెట్టడానికి స్ఫూర్తినిచ్చిన అసలైన అమరావతి (అమరావతి గుడి, బౌద్ధ క్షేత్రం) గ్రామాన్ని గత ప్రభుత్వం పల్నాడు జిల్లాలో కలిపింది.మరో విధంగా చెప్పాలంటే రాజధాని (కొత్త అమరావతి) ప్రాంతానికి, ఆ ప్రాంతానికి ఎటువంటి సబంధం లేని స్థితిని ఏర్పాటు చేసింది. దీనిని మార్చాలన్న అభిప్రాయం గట్టిగా వినిపిస్తోంది. పాత అమరావతిని కూడా రాజధాని ప్రాంతంలోకి తీసుకురావాలంటే ప్రస్తుతమున్న జిల్లాల్లోనూ మార్పులు చేయాల్సివస్తుంది. రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతం మొత్తాన్ని అమరావతి జిల్లాగా ఏర్పాటుచేయాలన్న మరో వాదన కూడా వినిపిస్తోంది.

పనుల్లో తీవ్ర జాప్యం

- బందరు ఫిషింగ్ హార్బర్ ఎప్పటికి పూర్తయ్యేనో?
- మూడేళ్లలో పూర్తయింది 65 శాతం పనులే
- సెప్టెంబర్‌తో ముగియనున్న పొడిగించిన గడువు

బందరు ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

కృష్ణా జిల్లా మచిలీపట్నం గిలకలదిండి వద్ద నిర్మిస్తోన్న రెండో దశ ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంట్రాక్టు సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నప్పటి నుంచి రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉన్నా, మూడేళ్లయినా పూర్తి కాలేదు. 65 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. నిర్మాణంలో జాప్యానికి గతంలో పూర్తయిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే కారణమని సమాచారం. కృష్ణా జిల్లాలోని నాలుగు మండలాల్లో 111 కిలోమీటర్లు సముద్రతీర ప్రాంతం ఉంది. వేలాది కుటుంబాలు మత్స్య సంపదపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. మచిలీపట్నం మండలం గిలకలదిండి ప్రాంతంలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌పై ఆధారపడి వెయ్యి కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ ఏటా రూ.300 కోట్లకుపైగా విలువైన సముద్ర ఉత్పత్తుల వ్యాపారం జరుగుతోంది. ఈ ఫిషింగ్ హార్బర్ మట్టితో పూడుకుపోయింది. దీంతో, పోటు వచ్చిన సమయంలో మాత్రమే ఇక్కడ నుంచి బోట్లు సముద్రంలో వేటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. లోతు తక్కువ ఉండడంతో సముద్రపు మొగ వద్ద వేటకు వెళ్లి వచ్చే సమయంలో బోర్లు తరుచూ మట్టిలో కూరుకుపోతున్నాయి. దీంతో, బోట్లు దెబ్బతిని మత్స్యకారులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక సౌకర్యాలతో నూతనంగా ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని 1990 ప్రాంతం నుంచి మత్స్యకారులు ఆయా ప్రభుత్వాలను కోరుతూ వచ్చారు. దీంతో, గతంలో 200 బోట్లకు మాత్రమే అంతంత మాత్రపు సౌకర్యాలతో ఉన్న గిలకలదిండి ఫిషింగ్ హార్బర్‌లో 550 బోట్లకు అవసరమైన సదుపాయాలతో నిర్మించేందుకు 2021లో గత వైసిపి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2,500 కుటుంబాలకు ఉపయోగపడేలా నూతన ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి అధికారులు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) తయారు చేశారు. 2021లో మార్చిలో ఆధునిక ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కాంట్రాక్టు సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం 24 నెలల్లో 2023 మార్చికి నిర్మాణం పూర్తవ్వాల్సి ఉంది. కరోనా కారణాన్ని చూపుతూ నిర్మాణ సంస్థ ఏడాది జాప్యం చేసింది. ఈ నేపథ్యంలో నిర్మాణ ఒప్పంద గడువును 2024 సెప్టెంబర్ వరకు ప్రభుత్వం పొడిగించింది. అయితే, ఆ సంస్థ ఇప్పటి వరకూ రూ.273.65 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి చేసింది. ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో 14 లక్షల మెట్రిక్ టన్నుల మట్టి తొలగించాల్సి ఉండగా, పది లక్షల మెట్రిక్ టన్నుల మట్టిని డ్రెడ్జింగ్ చేసి పూడిక తీసింది. తిరిగి ఈ ప్రాంతంలో మట్టి పూడిక పడకుండా ఉత్తరాన 1,150 మీటర్లకుగాను 1060 మీటర్లు, దక్షిణాన 1240 మీటర్లకుగాను వెయ్యి మీటర్లు బ్రేక్ వాటర్ పనులు పూర్తి చేసింది. వేటకు వెళ్లి వచ్చే బోట్లను ఇరువైపులా నిలిపేందుకు వీలుగా 764 మీటర్లు క్వే జట్టీని నిర్మించింది. చేపల గోదాములు, టూనా ఫిషింగ్ ఆక్షన్ హాలు, ఐస్ ప్లాంటు, లోడింగ్, ప్యాకింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. బ్రేక్ వాటర్ వద్ద మత్స్యకారులు దారి తప్పిపోకుండా లైట్‌హౌస్ తరహాలో అడ్వాన్స్ నావిగేషన్ సౌకర్యాలను కల్పించాల్సి ఉంది. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తికి నూతన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

చేతబడి నెపంతో పూజారిపై దాడి

ప్రజాశక్తి - పోలవరం

చేతబడి చేస్తున్నాడనే నెపంతో ఆలయ పూజారిపై ఒక వ్యక్తి కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ సంఘటన ఏలూరు జిల్లా పోలవరం మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలవరం ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఎల్ఎన్‌డి.పేట గ్రామానికి చెందిన జొన్నాడ పేరాస్వామి స్థానిక కనకదుర్గ ఆలయంలో పూజారిగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆయన తన ఇంటి నుంచి ఆలయానికి బయలుదేరారు. మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన చిక్కాల యేసు పూజారిపై కత్తితో దాడి చేశారు. చేతబడి చేస్తున్నాడనే నెపంతో విచక్షణా రహితంగా పొట్ట, చెవి, వీపుపై నరికాడు. తీవ్ర గాయాలపాలైన పూజారిని అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూజారి పేరాస్వామి గ్రామంలో చేతబడి చేస్తున్నాడని దాడికి పాల్పడిన వ్యక్తి ఏసు దుష్ప్రచారం చేస్తున్నాడని, దీనిపై అడిగినందుకు కత్తితో దాడికి పాల్పడ్డాడని అదే గ్రామానికి చెందిన పూజారి బంధువు మడకం లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల్లో హోంగార్డ్స్ సేవలు అభినందనీయం

- రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో హోంగార్డ్స్ సేవలు అభినందనీయమని రాయలసీమ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ అన్నారు. కడప సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డ్స్‌కు స్థానిక ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో వెల్ఫేర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డ్స్‌ను కోరారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలమని తెలిపారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశానిర్దేశం చేశారు. హోంగార్డ్స్ సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైలరెడ్డి. హోంగార్డ్స్ పాల్గొన్నారు.

విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా చేసి, యువకులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన ఆయన మంగళవారం ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యాలయానికి వచ్చారు. ఆయనకు టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ సహా పలువురు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పల్లా మాట్లాడుతూ అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయడం, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏడాదిన్నరలోగా అమరావతికి ఒక రూపు వస్తుందన్నారు. విశాఖను రాజధానిగా చేస్తామని చెప్పిన వైసిపి గంజాయికి రాజధానిగా మార్చేసిందని విమర్శించారు. ఈ నగరాన్ని దేశంలోనే నెంబర్ వన్ ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణం పేరుతో జగన్ ప్రభుత్వం రూ.700 కోట్లు ప్రజాధనం వృథా చేసిందని ఆరోపించారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగదని ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. అన్నా క్యాంటీన్లను త్వరగా తెరిపించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పార్టీ బలోపేతం కోసం పని చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వడమే కాకుండా నామినేటెడ్ పదవులలో వారిని నియమిస్తామని చెప్పారు. నామినేటెడ్ పదవుల కేటాయింపులో జనసేన, బిజెపిలను కలుపుకొని సమన్యాయంగా ముందుకెళ్తామని చెప్పారు. అగనంపూడి వద్ద ఉన్న టోల్ గేటును నెల రోజులలోగా తొలగించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో విశాఖపట్నం ఎంపి ఎం శ్రీభరత్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలి

- ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు : గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జులై 28 నుండి నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ప్రకటించిందని, కానీ ఎన్నికల దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సిలబస్ విస్తృతి ఎక్కువగా ఉందని తెలిపారు. మరో రెండు నెలలు గ్రూప్-2 పరీక్షలను పొడిగించాలని లక్ష్మణరావు కోరారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రాక్ సిరామిక్స్ కార్మికులు

రాక్ సిరామిక్స్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్ వద్ద రాక్ సిరామిక్స్ కార్మికులు ధర్నా చేశారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని, యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని ప్లకార్డులు చేతబూని నినదించారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జీ మాట్లాడారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా 25 మంది కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఆదేశాలిచ్చినా యాజమాన్యం పెడచెవిన పెట్టిందన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్మిక నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ..కలెక్టర్, నూతన ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, సిఐటియు నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, రాక్ సిరామిక్ కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాసుదేవరెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టాలి

హైకోర్టుకు చెప్పిన సిఐడి

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎస్‌బిసిఎల్)కు చెందిన ఫైళ్లు, డాక్యుమెంట్స్, కంప్యూటర్ పరికరాలను గుట్టుగా తరలించారనే అభియోగాలపై సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆ సంస్థ మాజీ ఎమ్‌డి డి వాసుదేవరెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది. సిఐడి న్యాయవాది వినతి మేరకు విచారణను ఈ నెల 20కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ తల్లాప్రగఢ మల్లికార్జునరావు మంగళవారం ప్రకటించారు. కీలక పత్రాలను వాసుదేవరెడ్డి తన కారులో తీసుకుపోతుంటే చూశానంటూ కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ సిఐడికి ఫిర్యాదు చేశారు. దీనిపై సిఐడి ఈ నెల 6న వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టును వాసుదేవరెడ్డి ఆశ్రయించిన కేసులో సిఐడి తరపున సీనియర్ అడ్వకేట్ పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది ఎం లక్ష్మీనారాయణ వాదిస్తూ, విజయవాడలోని వాసుదేవరెడ్డి ఇంట్లో సోదాలు చేయాల్సి ఉందన్నారు. ఇంటి తాళాలు పగులగొట్టేందుకు అనుమతి కోరుతూ లోయర్ కోర్టులో పిటిషన్ వేశామన్నారు. అక్కడ కేసు విచారణ తేలే వరకు ఈ కేసును వాయిదా వేయాలని కోరడంతో అందుకు హైకోర్టు అనుమతినిచ్చింది.

AXIS BANK LIMITED

రిటైల్ లెండింగ్& పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002

స్వాధీనతా ప్రకటన రూల్8(1) క్రింద (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్** (గతంలో యుటిఐ బ్యాంక్ లిమిటెడ్‌గా పేరుగలది) దీని రిజిస్టర్డు ఆఫీసు: "త్రిషుల్" సమర్తేశ్వర్ టెంపుల్ ఎదురుగా, లా గార్డెన్ దగ్గర, ఎల్లిస్‌బ్రిడ్జి, అహ్మదాబాద్-380006 వద్ద మరియు మరో ప్రదేశంలో దీని బ్రాంచి ఆఫీసు: **రిటైల్ లెండింగ్& పేమెంట్ గ్రూప్ (లోకల్ ఆఫీసు/బ్రాంచి): యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.30-22-79, శ్రీ టవర్స్, 1వ అంతస్తు, ఏలూరు రోడ్డు, సీతారామపురం సర్కిల్, విజయవాడ-520002** వద్ద కలిగియుండి, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **డిమాండ్ నోటీసు** జారీచేసి, సార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీత/ హామీదారులు/ తాకట్టుదారులను ఆహ్వానింపబడుచున్నది.

క్ర. సం.	దరఖాస్తుదారు/సహ-దరఖాస్తుదారు/ హామీదారులు పేరు చిరునామా	బకాయి రూ.లలో	ఆఫర్‌చేసిన ఈక్విటేబుల్ తాకట్టుపెట్టిన ఆస్తి & స్వాధీనతా తేది
4.	**1. శ్రీ హరినాథ్ పెండ్యాల,** తండ్రి ఆదినారాయణ పెండ్యాల, ఫ్లాట్ నం.జి-2, శ్రీసాయి దుర్గ రెసిడెన్సీ, ప్రశాంతినగర్, ఐటిఐ కాలేజీ ఎదురుగా, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. **మరియు: శ్రీ హరినాథ్ పెండ్యాల,** తండ్రి ఆదినారాయణ పెండ్యాల, ఇ.నం.1-84, గంగనపల్లి, నర్పాల, వాటర్ పంపు దగ్గర, అనంతపూర్, ఆం.ప్ర.-515425. **మరియు: శ్రీ హరినాథ్ పెండ్యాల,** కేరాఫ్ రినేష్ రెస్టారెంట్, (దీని ఏకైక యజమాని) డోర్ నం.13/35, ఎన్‌హెచ్-, ఏలూరు రోడ్డు, నిదమనూరు, కృష్ణాజిల్లా, ఆం.ప్ర.-521104. **2. శ్రీమతి పెండ్యాల శ్రీ లత,** భర్త హరినాథ్ పెండ్యాల, ఫ్లాట్ నం.సి-2, శ్రీసాయి దుర్గ రెసిడెన్సీ, ప్రశాంత్ నగర్, ఐటిఐ కాలేజీ ఎదురుగా, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. **మరియు శ్రీమతి పెండ్యాల శ్రీలత,** భర్త హరినాథ్ పెండ్యాల, ఇ.నం. 1-84, గంగనపల్లి, నర్పాల, వాటర్ పంపు దగ్గర, అనంతపూర్, ఆం.ప్ర.-515425. **మరియు: శ్రీమతి పెండ్యాల శ్రీ లత,** కేరాఫ్ దినేష్ రెస్టారెంట్ (దీని ఏకైక యజమాని) డోర్ నం.40-5-14, టిక్కిల్ రోడ్, లబ్బీపేట్, మగల్‌రాజా పురం, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-520010. డిమాండ్ నోటీసు తేది: 04.07.2024 ఖాతా నం.: **LTR006903048419**	**రూ. 53,12,901/-** (రూపాయలు యాభై మూడు లక్షల పన్నెండు వేల తొమ్మిది వందల ఒకటి మాత్రమే)	అనంతపూర్ జిల్లా, అనంతపూర్ సబ్-డివిజన్, పాపంపేట గ్రామం, నారాయణ పురం, పంచాయతిలో సర్వే నం.67/1పార్ట్, ఫ్లాట్ నం.8, ఎల్.పి.నం.44/1996, పూర్తి ల్యాండ్ మరియు దీని నిర్మాణం విస్తీర్ణం 357.77చ.గ.లుగల ఆస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** 40అ.ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** ఫ్లాట్ నం.9, **పడమర:** ఇతరుల ఆస్తి, **ఉత్తరం:** ఫ్లాట్ నం.7. లాంఛనప్రాయ స్వాధీనం: **15.06.2024**

తేది: 19.06.2024,
ప్రదేశం: ఆం.ప్ర.

సం/- అధీకృత అధికారి,
యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

21, 22 తేదీల్లో అసెంబ్లీ సమావేశాలు!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత ఈ నెల 24 నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతాయని ప్రకటించినప్పటికీ సమావేశాల తేదీలను ప్రభుత్వం ముందుకు మార్చింది. ఈ సమావేశాల్లో సభ్యుల ప్రమాణస్వీకారం, శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగనుంది. శాసనసభ స్పీకరుగా చింతకాయల అయ్యన్నపాత్రుడుకు అవకాశం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. చీఫ్ విప్, విప్‌లపై స్పష్టత రావాల్సి ఉంది.

చంద్రబాబు తప్పిదం వల్లే పోలవరం ధ్వంసం

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ తప్పిదాల వల్లే పోలవరం దెబ్బతిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడటం తగదని, వాస్తవంగా చంద్రబాబు ప్రభుత్వ తప్పిదాల వల్లే ధ్వంసమైందని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. 2014 నుంచి 2019 కాలంలో 72 శాతం పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆ కొద్దీ పూర్తికావడానికి నాలుగేళ్ల సమయం ఎందుకు పడుతుందో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2018లోపే పోలవరం పూర్తి చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందని ప్రశ్నించారు. నదీ ప్రవాహం మళ్లింపు పనులు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి కాకుండానే డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టడం చంద్రబాబు చేసిన పెద్ద తప్పిదమని తెలిపారు.

వాస్తవంగా జగన్ హయాంలోనే పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరిగాయని అన్నారు. కాఫర్ డ్యామ్‌లు, స్పిల్ వే నిర్మాణ పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని తెలిపారు. రాజధాని, పోలవరం పూర్తిచేసే అవకాశాన్ని ప్రజలిచ్చారని, చంద్రబాబు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి తప్ప గత జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదని అన్నారు.

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

nido HOME FINANCE

(గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)(నిడో),
రిజిస్టర్డు ఆఫీసు: టవర్ 3, 5వ అంతస్తు, వింగ్-బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్ల (డబ్ల్యు), ముంబయి-400070, రీజినల్ ఆఫీసు చిరునామా: 3వ & 4వ అంతస్తు, శ్రీ ప్రశాంతి సాయి టవర్స్, ప్లాట్ నం.68, మున్సిపల్ నం.8-2-248, నాగార్జున హిల్స్, రోడ్ నం.1, బంజారాహిల్స్, పంజాగుట్ట దగ్గర, హైదరాబాద్-500082.

ది షార్ఫసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, నిడో నుండి వారు పొందిన రుణ సదుపాయాల యొక్క అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో దిగువ రుణగ్రహీతలు డిఫాల్టిచెందారు మరియు సదరు రుణ ఖాతాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఎ)గా వర్గీకరించబడినవి. వారికి వారి చివరి సారిగా తెలిసిన చిరునామాకు ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 (సార్ఫసీ యాక్ట్) యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి డిమాండ్ నోటీసు జారీచేయబడినది. దీనికి అదనంగా సదరు డిమాండ్ నోటీసును ఈ బహిరంగ ప్రకటన ద్వారా కూడా వారికి తెలియజేయబడుచున్నది.
రుణగ్రహీతల, సెక్యూరిటీస్, బకాయి మొత్తాలు, సెక్షన్ 13(2) క్రింద పంపిన డిమాండ్ నోటీసు మరియు వారి క్లెయించేయాల్సిన మొత్తాల వివరాలు ఇందు దిగువ ఇవ్వబడినవి:

1. రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారు పేరు& చిరునామా మరియు రుణ మొత్తాలు:
బి. రవీంద్రనాథ్ (రుణగ్రహీత) బొమ్మన బోయిన వెంకట లక్ష్మి (సహ-రుణగ్రహీత) కొప్పుల స్వాతి (సహ-రుణగ్రహీత), నివాస చిరునామా: 31-14-21/ఎ, 2వ అంతస్తు, ఆకులతాతయ్య వీధి, మాచవరం, విజయవాడ-520004.
ఎల్ఎఎన్ నం.: **LVIJLAP0000068298** రుణ ఒప్పంద తేది: **07.02.2019.**
రుణ మొత్తాలు: రూ.31,68,000/- (రూపాయలు ముప్పై ఒక లక్షల అరవై ఎనిమిది వేలు మాత్రమే)
ఎన్‌పిఎ తేది: 04.06.2024 డిమాండ్ నోటీసు తేది: 10.06.2024
బకాయి మొత్తాలు: రూ.23,99,459.18 పై.లు (రూపాయలు ఇరువై మూడు లక్షల తొంబై తొమ్మిది వేల నాలుగు వందల యాభై తొమ్మిది మరియు పద్దెనిమిది పైసలు మాత్రమే) మరియు **డిమాండ్ నోటీసు తేది 10.06.2024** తేదీ నుండి తదుపరి వడ్డీ.

ఆస్తి యొక్క షెడ్యూలు: బాలాజీరావుపేట్, తెనాలి 522202 వద్ద మున్సిపల్ వార్డు నం.2, బ్లాక్ నం.1, అసెస్మెంట్ నం. 1028000929 వద్దగల 166 1/2చ.గ.లు లేదా 139.21చ.మీ.ల విస్తీర్ణంతో టి.ఎస్.నం.8/1, డోర్ నం. 8-18-1, పాత డోర్ నం.8-19-12గల ఆస్తి మొత్తం భాగం. **సరిహద్దులు: ఉత్తరం:** గొర్ల శ్రీనివాస్ ఆస్తి, **దక్షిణం:** మున్సిపల్ బాజారు, **తూర్పు:** సయ్యద్ ఖాసిం & ఇతరుల ఆస్తి, **పడమర:** బొమ్మనబోయిన వేంకటేశ్వర రావు ఆస్తి.

3. రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారు పేరు& చిరునామా మరియు రుణ మొత్తాలు:
మంగ దేవి రేవు (రుణగ్రహీత) రేవు శ్రీనివాస రావు (సహ-రుణగ్రహీత) నివాస చిరునామా: డోర్ నం.56-11-11, హై స్కూల్ రోడ్, పటమట, విజయవాడ-520010.
ఎల్ఎఎన్ నం.: **LVIJSTH0000096296** రుణ ఒప్పంద తేది: **06.02.2023.**
రుణ మొత్తాలు: రూ.22,50,000/- (రూపాయలు ఇరువై రెండు లక్షల యాభై వేలు మాత్రమే)
ఎన్‌పిఎ తేది: 04.06.2024 డిమాండ్ నోటీసు తేది: 10.06.2024
బకాయి మొత్తాలు: రూ.23,37,061.48పై.లు (రూపాయలు ఇరువై మూడు లక్షల ముప్పై ఏడు వేల అరవై ఒకటి మరియు నలభై ఎనిమిది మాత్రమే) మరియు **డిమాండ్ నోటీసు తేది 10.06.2024** తేదీ నుండి తదుపరి వడ్డీ.

ఆస్తి యొక్క షెడ్యూలు: హనుమాన్ నగర్, ప్రసాదంపాడు, విజయవాడ-521108 వద్ద ఆర్ఎస్ నం.35/6డి, విస్తీర్ణం 15చ.గ.ల విడదీయలేని భాగం (520+130+20= 670చ.అలు)(ప్లింత్ + ఉమ్మడి+ కార్ పార్కింగ్)తో శ్రీసాయి దీపిక గ్రాండ్, రెండవ అంతస్తు, ఫ్లాట్ నం.ఎస్4గల ఆస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: ఉత్తరం:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఉమ్మడి కారిడార్ & మెట్లు, **తూర్పు:** కారిడార్, **పడమర:** ఓపెన్ టు స్కై.

4. రుణగ్రహీత, సహ-రుణగ్రహీత, హామీదారు పేరు& చిరునామా మరియు రుణ మొత్తాలు:
శివ ప్రసాద్ దిరిషా (రుణగ్రహీత), డి. ఆషా లత (సహ-రుణగ్రహీత), నివాస చిరునామా: తండ్రి డి. సూర్యసేన్, డోర్ నం.6-204/1, గ్రౌండ్ ఫ్లోర్-1, మహాలక్ష్మి నివాస్, పట్టెల వారి స్ట్రీట్, రామవరప్పాడు, విజయవాడ-521108.
ఎల్ఎఎన్ నం.: **LVIJ0HL0000046371 & LVIJ0TU0000046375** రుణ ఒప్పంద తేది: **20.04.2018.**
రుణ మొత్తాలు: రూ.17,32,000/- (రూపాయలు పదిహేడు లక్షల ముప్పై రెండు వేలు మాత్రమే)
ఎన్‌పిఎ తేది: 04.06.2024 డిమాండ్ నోటీసు తేది: 10.06.2024
బకాయి మొత్తాలు: రూ.16,81,081.20పై.లు (రూపాయలు పదహారు లక్షల ఎనభై ఒక వేల ఎనభై ఒకటి మరియు ఇరువై మాత్రమే) & **రూ.16,71,944.97పై.లు** (రూపాయలు పదహారు లక్షల డెబ్బై ఒక వేల తొమ్మిది వందల నలభై నాలుగు మరిఉ తొంబై ఏడు పైసుల మరియు **డిమాండ్ నోటీసు తేది 10.06.2024** తేదీ నుండి తదుపరి వడ్డీ.

ఆస్తి యొక్క షెడ్యూలు: షెడ్యూలు-ఎ: రామవరపాడు, విజయవాడ-521108 వద్దగల ఆర్ఎస్ నం.132/1, 132/2, ఎల్,.పి.నం.59/1989, ఫ్లాట్ నం.36లోగల ఈజిమెంట్ అన్ని హక్కులతో పూర్తి విస్తీర్ణం 215.22చ.గ.లు లేదా 263.55చ.మీ.లలో 39.03చ.గ.లు లేదా 32.63చ.మీ.ల నివాస సైటు విస్తీర్ణం యొక్క విడదీయలేని మరియు సూచించ జాలనీ భాగం. **సరిహద్దులు: ఉత్తరం:** కోగంటి సింధూర ఆస్తి, **దక్షిణం:** ఫ్లాట్ నం.37, **తూర్పు:** 33అ.ల వెడల్పు పంచాయత్ రోడ్డు, **పడమర:** 33అ.ల వెడల్పు పంచాయత్ రోడ్. **షెడ్యూలు-బి:** రామవరపాడు, విజయవాడ-521108 వద్దగల 90 చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా మరియు ఉమ్మడి ఏరియాతో కలిపి 1000చ.అ.ల ప్లింత్ ఏరియాతో డోర్‌నం.6-204/1, అసెస్మెంట్ నం.3686, మహాలక్ష్మి నివాస్, గ్రౌండ్ ఫ్లోర్ ఫ్లాట్ నం.1. **సరిహద్దులు: ఉత్తరం:** పార్కింగ్ ఏరియా, **దక్షిణం:** ఫ్లాట్ నం.37 ప్రక్కన మహాలక్ష్మి నివాస్ యొక్క ప్రహారీగోడ, **తూర్పు:** మెట్లు& కారిడార్, **పడమర:** 33అ.ల వెడల్పు పంచాయత్ రోడ్డు.

ఈ నోటీసు యొక్క 60 రోజుల్లోగా ఇందు పై పేర్కొన్న బకాయి మొత్తాలను పూర్తిగా చెల్లించవలసిందిగా ఇందుమూలంగా పై రుణగ్రహీతలను కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, క్రింది సంతకందారు పై పేర్కొన్న సెక్యూరిటీస్‌ను స్వాధీనంచేసుకొనుటకు షార్ఫసీ యాక్ట్ క్రింద చర్యలను తీసుకొందురు. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారం దయచేసి గమనించండి: మా ముందస్తు అనుమతి లేకుండా మీరు అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా పై పేర్కొన్న సెక్యూరిటీస్‌ను బదిలీచేయుట నుండి నిషేదింపబడినారని దయచేసి గమనించగలరు.

ప్రదేశం: ఆం.ప్ర.
తేది: 19.06.2024

సం/- అధీకృత అధికారి, నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున
(గతంలో ఇడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరుగలది)

పరస్పర సహకారం అవసరం: మంత్రి తుమ్మల

ప్రజాశక్తి -తిరుమల

తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకుని, తెలుగుజాతి ఔనత్యాన్ని, కీర్తిని కాపాడుకోవాలని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తిరుమల శ్రీవారిని విఐపి బ్రేక్ సమయంలో మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుమల లో రాజకీయాలు మాట్లాడటం మంచిది కాదని, తెలుగు ప్రజల కష్టాలు తీర్చే శక్తి సామర్థ్యాలను పాలకులకు ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

శ్రీవారి సేవలో త్రివిక్రమ్ శ్రీనివాస్

తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శించుకున్నారు.

LAURUS Labs
Chemistry for Better Living

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: లారస్ ఎన్‌క్లేవ్, ఫ్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి గ్రామం, పరవాడ మండలం, అనకాపల్లి జిల్లా – 531 021, ఆంధ్రప్రదేశ్.
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం. 7, బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034, తెలంగాణ.
Phone: +91 40 3980 4333; **Fax:** +91 40 3980 4320 | **Email:** secretarial@lauruslabs.com; **Website:** www.lauruslabs.com
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య : L24239AP2005PLC047518

కంపెనీ యొక్క 19వ వార్షిక సర్వసభ్య సమావేశం కొరకు ప్రకటన

ఇందుమూలంగా **ప్రకటన** ఇవ్వడమేమనగా, సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసిఏ)చే జారీచేయబడిన సర్క్యులర్స్‌తో చదువబడే దాని క్రింది రూల్స్ మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క నియమాలను అనుసరించి నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్) ద్వారా సమకూర్చబడు **విడియో కాన్ఫరెన్సింగ్ (విసి) సదుపాయం ద్వారా గురువారం, జులై 11, 2024న మ॥ 03.00 గం.లకు లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ ("ది కంపెనీ")** యొక్క సభ్యుల **పంతొమ్మిదవ వార్షిక సర్వసభ్య సమావేశం** ("ఏజియం" లేదా "సమావేశం") నిర్వహించబడుతుంది.

ఆర్థిక సం॥ 2023-24 కొరకు కంపెనీ యొక్క వార్షిక రిపోర్టుతో పాటు సమావేశంలో సాధారణ మరియు ప్రత్యేక ఐటెంలను సమీక్షించుటకు, ఏదైతే మార్చి 31, 2024తో ముగిసిన సం॥ కొరకు ఆడిటెడ్ స్టాండలోన్ & కన్సాలిడేటెడ్ ఆర్థిక నివేదికలు కలిగియున్న మరియు ఆడిటర్స్ & డైరెక్టర్స్ రిపోర్టు, కార్పొరేట్ గవర్నెన్స్ రిపోర్టు, నోటీసు మొ॥ వాటిని శుక్రవారం, జూన్ 14, 2024 తేది రోజున రిజిస్టర్ ఆఫ్ మెంబర్స్‌లో వున్న సభ్యులకు ఇ-మెయిల్ ద్వారా పంపడమైనది. ఇప్పటికీ వారి ఇమెయిల్ ఐడిలు రిజిస్టరు చేసుకోని వాటాదారులు వారి సదరు డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌ను సంప్రదించి ఇమెయిల్ ఐడి రిజిస్టర్ చేసుకోవలసిందిగా కోరబడుచున్నది మరియు నోటీసు మరియు వార్షిక నివేదిక కొరకు కంపెనీకి ఇమెయిల్ పంపిస్తే కంపెనీ దానికి స్పందిస్తుంది. వాటాదారులు తదుపరి వివరాల కొరకు, దినపత్రికల్లో జూన్ 12, 2024న కంపెనీచే ప్రచురించబడిన ప్రకటనను చూడవచ్చును.

నోటీసు మరియు వార్షిక నివేదికను మా వెబ్‌సైట్ www.lauruslabs.com నుండి కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఏజియం వద్ద సమీక్షించు ఐటెంలకు సంబంధించిన ఏవేని పత్రాలను పరిశీలించుట కొరకు, వాటాదారులు secretarial@lauruslabs.com ఇ-మెయిల్‌కి వ్రాయవచ్చును మరియు కంపెనీ వారికి స్పందిస్తుంది.

పైన చెప్పిన సర్క్యులర్ ప్రకారం, రిమోట్ ఇ-ఓటింగ్, విడియో కాన్ఫరెన్సింగ్ (విసి) అదే విధంగా సమావేశం జరుగునప్పుడు ఇ-ఓటింగ్ కొరకు సదుపాయం కల్పించుటకు అధీకృత ఏజెన్సీగా నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ లిమిటెడ్ (ఎన్ఎస్‌డిఎల్) సేవలను కంపెనీ వినియోగిస్తుంది.

సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 44 మరియు కంపెనీస్ (మేనేజ్‌మెంట్ & అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 యొక్క రూల్ 20తో చదువబడే కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 108 యొక్క నియమాలను అనుసరించి, కంపెనీ జులై 11, 2024న నిర్వహించబడు 19వ ఏజియం యొక్క నోటీసులో ఇచ్చినట్లు వ్యాపార ఐటెంలపై ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకొనుటకు సభ్యులకు కంపెనీ సదుపాయం కల్పిస్తుంది. సభ్యులు ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం వినియోగించి వారి ఓట్లను ఏ ప్రదేశం నుండి అయిన వేయవచ్చును (రిమోట్ ఇ-ఓటింగ్). రిమోట్ ఇ-ఓటింగ్ జులై 08, 2024న ఉ॥ 09.00 గం.లకు ప్రారంభమై మరియు జులై 10,2024న సా॥ 05.00 గం.లకు ముగించబడుతుంది. పై సదరు తేది & సమయం దాటిన తరువాత రిమోట్ ఇ-ఓటింగ్ అనుమతించబడదు మరియు రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూల్ జులై 11, 2024న సా॥ 5గం.ల తరువాత మూసివేయబడుతుంది. కటాఫ్ తేదీ నాటికి అనగా., గురువారం, జులై 04, 2024 నాటికి సభ్యుల రిజిస్టర్ / బెనెఫిషల్ ఓనర్స్ రిజిస్టర్‌లో ఎవరి పేర్లైతే కనిపించునో అట్టి వ్యక్తి మాత్రమే రిమోట్ ఇ-ఓటింగ్ / సమావేశంలో ఇ-ఓటింగ్ సదుపాయం పొందుటకు అనుమతించబడుదురు. ఏజియం నిమిత్తం కంపెనీ యొక్క సభ్యుల రిజిస్టర్ మరియు షేర్ ట్రాన్స్‌ఫర్ బుక్స్ జులై 05, 2024 నుండి జులై 11, 2024 (రెండు రోజులతో సహా) వరకు మూసి ఉంచబడుతాయి.

సమావేశం నోటీసు పంపబడిన తరువాత ఎవరైనా కంపెనీ యొక్క సభ్యుడైన మరియు కటాఫ్ తేదీ నాటికి వాటాలు కలిగియున్న, వారు ఇ-ఓటింగ్ సదుపాయం పొందుట కొరకు వారి సదరు డిపాజిటరీస్‌తో సంప్రదించవచ్చును. ఇ-ఓటింగ్ సదుపాయం పొందుటకు వివరణాత్మక విధానం సమావేశపు నోటీసులో కూడా ఇవ్వబడినవి మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్ పై అందుబాటులో ఉంటుంది.

రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓటువేసిన ఎవరైనా సభ్యులు సమావేశానికి హాజరవచ్చును, కాని సమావేశంలో వారు తిరిగి ఓటువేయుటకు అనుమతించబడరు.

సమావేశం వ్యవధిలో ఇ-ఓటింగ్ కొరకు సదుపాయం అందుబాటులో ఉంటుంది మరియు ఎవరైతే రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటువేయని సభ్యులు వారి ఓటును సమావేశం కాలవ్యవధిలో వారు వినియోగించుకోవచ్చును.

డిపాజిటరీ అనగా, ఎన్ఎస్‌డిఎల్ మరియు సిడిఎస్ఎల్ ద్వారా లాగిన్‌కు సంబంధించిన ఏవేని సాంకేతిక సమస్యల కొరకు డిమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారుల కొరకు హెల్ప్‌డెస్క్:

లాగిన్ రకం	హెల్ప్‌డెస్క్ వివరాలు
ఎన్ఎస్‌డిఎల్ తో డిమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారులు	ఇ-మెయిల్: evoting@nsdl.com or నెం. : 022 - 4886 7000 కి కాల్ చేయండి
సిడిఎస్ఎల్ తో డిమ్యాట్ విధానంలో వాటాలు కలిగియున్న వాటాదారులు	ఇ-మెయిల్: helpdesk.evoting@cdslindia.com or టోల్ ఫ్రీ నెం. : 1800 22 55 33 కి కాల్ చేయండి

ప్రదేశం : హైదరాబాద్
తేది: 18.06.2024

బోర్డు ఆదేశం మేరకు
లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున
సం/- **జి. వెంకటేశ్వర్ రెడ్డి**
కంపెనీ సెక్రటరీ & కంప్లైన్స్ ఆఫీసర్

సంపాదకీయం

భద్రత గాలికి!

రైలు ప్రయాణికుల భద్రత గాలిలో దీపంలా కొట్టుమిట్టాడుతోంది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు, బుల్లెట్ ట్రైన్స్, అమృత్ స్టేషన్స్ అంటూ... ప్రధాని మొదలు ఛోటా మోటా నేతల వరకూ తమ హయాంలో రైల్వేలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లామంటూ చంకలు గుద్దుకుంటూంటారు. రైల్వే ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెడుతూ..ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తూ...అభివృద్ధి పేరుతో ప్రచారార్భాటం చేస్తున్నారు. అంతలోనే... ఢీకొట్టే రైళ్లు..పల్టీ కొట్టే బోగీలు...గాలిలో కలిసిపోయే ప్రాణాలు, క్షతగాత్రుల ఆర్తనాదాలు, మిన్నంటే రోదనలు, హృదయ విదారక దృశ్యాలు... ప్రపంచంలో అమెరికా, రష్యా, చైనాల తరువాత అతి పెద్ద రైల్వే వ్యవస్థ కలిగిన భారత్‌లో నిత్యం ప్రమాదాలెందుకు జరుగుతున్నాయి? ప్రకృతి విపత్తులు, టెర్రరిస్ట్ దాడులు లాంటివి జరిగినప్పుడు శాటిలైట్ సంకేతాల ఆధారంగా అనేక దేశాలు క్షణాల్లో దారిమళ్లిస్తూ... ప్రయాణికుల భద్రతకు భరోసానిస్తుంటే... మన దేశంలో ఈ దుస్థితి ఎందుకు? ప్రతి రోజూ రెండున్నర కోట్ల మంది ప్రయాణికులను, 33 లక్షల టన్నులకుపైగా సరుకులను 22 వేలకుపైగా రైళ్లు గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. సామాన్యుడు ప్రయాణించే జనరల్ బోగీలు, స్లీపర్లు కుదించేస్తూ... ఎసి బోగీలు, ట్రైన్లు పెంచేస్తున్నారు. రైల్వే వ్యవస్థను మరింత ఆధునీకరించి, సామాన్యులకు భద్రత, భరోసాతో కూడిన సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో లోపించడం విస్మయకరం.

గత పదేళ్ల మోడీ పాలనలో లక్ష కోట్లు కేటాయించిన అహ్మదాబాద్-ముంబై బుల్లెట్ రైళ్లు పరుగులు దీస్తున్నాయి. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు దేశంలో ఎక్కడ ప్రారంభమైనా స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ అక్కడికి వెళ్లి, ఘనంగా జెండా ఊపుతారు. వాటి గరిష్ట వేగానికి తగినట్టు ట్రాకుల ఆధునీకరణకు మాత్రం మరో ఐదారేళ్లు పడుతుందట. ఈ బుల్లెట్ రైళ్లు, వందే భారత్‌లో టిక్కెట్లు ఇంచుమించు విమాన ఛార్జీలకు సరిసమానంగా ఉంటూ...సామాన్యుడికి అందని ద్రాక్షగానే మిగిలాయి. ఇదే సమయంలో ప్రయాణికుల భద్రత నానాటికీ తీసికట్టుగా మారింది. 2014 నుంచి ప్రతి నెలా సగటున 11 రైల్వే ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది జూన్ 2న ఒరిస్సాలోని బాలాసోర్‌లో జరిగిన ప్రమాదంలో 296 మంది ప్రాణాలు కోల్పోగా, 900 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. తాజాగా జరిగిన కాంచనగంగా ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి పెరిగింది. 40 మందికి పైగా క్షతగాత్రులయ్యారు.

ఈ ప్రమాదాలకు రైల్వే భద్రతపై ఉదాసీనతే ప్రధాన కారణంగా ఉంటోంది. ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు ఢీకొనకుండా రక్షణ కల్పించే ట్రైన్ యాంటీ కొలిజియం సిస్టమ్ (కవచ్) మన దేశానికి ఉంది. దేశవ్యాప్తంగా లక్ష కిలోమీటర్లకుపైగా రైల్వే ట్రాక్‌లు ఉంటే, వాటిలో 1500 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌లపైనే ఆ వ్యవస్థను అనుసంధానం చేశారు. ఈ ఏడాది చివరికి మూడు వేల కిలోమీటర్లకు అందుబాట్లోకి వస్తుందని తాజాగా ప్రకటించారు. అంటే మిగతా 97 వేల కిలోమీటర్లలోన వెళ్లే రైళ్లలో ప్రయాణికుల భద్రతకు భరోసా ఇచ్చేదెవరు? రైల్వే భద్రతపై మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని 2022 కాగ్ ఎండగట్టింది. రైల్వే ట్రాక్‌ల ఇన్‌స్పెక్షన్లు 50 శాతం జరగడం లేదు. దెబ్బతిన్న పట్టాల స్థానంలో కొత్త పట్టాల ఏర్పాటుకు బడ్జెట్‌లో భారీగా కోత విధించారు. 26 శాతం ప్రమాదాలకు కొత్త పట్టాలు ఏర్పాటు చేయకపోవడమే కారణం. రైల్వేల్లో 2.74 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్న దృష్టే లేదు. రైల్వే వ్యవస్థలో అతి కీలకమైన పాత్ర పోషించే లోకోపైలట్ పోస్టులు సైతం భర్తీ చేయడం లేదు. ఉన్నవారిపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోంది. 12 గంటలకు మించి డ్యూటీలు వేయకూడదన్న నిబంధనలను సైతం తుంగలో తొక్కి డ్యూటీలు వేస్తున్నారు. ఇక గ్యాంగ్‌మెన్ పోస్టులు, సిగ్నల్ వ్యవస్థ ఆధునీకరణ, ట్రాక్‌ల రెన్యువల్, మెయింటెనెన్స్, ఇన్‌స్పెక్షన్...తదితర పనుల న్నింటినీ గాలికొదిలేశారు. దీనిఫలితంగానే తరచూ భారీ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సాధారణ ప్రయాణికుల భద్రతకు, సౌకర్యవంతమైన ప్రయాణానికి పూచీ పడాల్సింది, అందుకు అనుగుణంగా రైల్వే వ్యవస్థను తీర్చిదిద్దాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే!

మహనీయుల మాట



పేదరికం వున్నంత వరకూ
నిజమైన స్వాతంత్ర్యం వుండదు.

- నెల్సన్ మండేలా

ఉద్యమాలే బిజెపిని ఓటమి అంచున నిలబెట్టాయి

విశ్లేషణ

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రజా ఉద్యమాల విజయంతో పాటు...నిరంకుశ, మతతత్వ, కార్పొరేట్, నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ పట్ల తీవ్ర వ్యతిరేకతను వెల్లడించాయి. దశాబ్దం క్రితం నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండే బిజెపి పాలనకు వ్యతిరేకంగా ఒక స్థిరమైన, అవిశ్రాంత పోరాటం చేసిన వారు రైతులు, కార్మికులు.

నిరంకుశ, ప్రజా వ్యతిరేక మోడీ ప్రభుత్వం 2014లో భూసేకరణ ఆర్డినెన్సు విడుదల చేసిన వెంటనే, దానికి వ్యతిరేకంగా సమస్యల ఆధారంగా ఐక్యతను నెలకొల్పడం, 'భూమి అధికార్ ఆందోళన్' చేపట్టిన పోరాటాలతో పాటు, ప్రతిపక్ష పార్టీలు కూడా పార్లమెంటును ముట్టడించడంతో ఆ ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం అనివార్యంగా ఉపసంహరించుకోవలసి వచ్చింది. ఇది నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎదుర్కొన్న మొదటి ఓటమి. ఇది నిస్సందేహంగా పట్టు విడవకుండా, సమస్యలను తీసుకుని చేసిన, ఐక్య పోరాటాల కృషి వల్లనే సాధ్యమైంది. కేవలం ఈ విజయంతోనే పోరాటాలు ఆగలేదు.



డా॥ విజూకృష్ణన్

ప్రజల జీవనోపాధిపై దాడి, నోట్ల రద్దు వల్ల ఏర్పడిన సంక్షోభం, గో రక్షణ పేరుతో జరిగిన దాడులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో పాటు, వాటి విక్రయాలకు, అటవీ హక్కులను హరించడానికి వ్యతిరేకంగాను, జాతీయ మానిటైజేషన్ పైప్‌లైన్ లాంటి అనేక సమస్యలపైనా పోరాటాలు ప్రారంభించారు. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక సుదీర్ఘ కాలంగా ఉనికిలో ఉండటమేగాక, ఆయా సంఘాలు దశాబ్దాలుగా నయా ఉదారవాద విధానాలను ఎదుర్కోవడంలో ప్రధాన పాత్ర పోషించాయి. వారి అనుభవం కూడా రైతు ఉద్యమానికి లాభించింది. 2017 జూన్‌లో బిజెపి పాలిత మధ్యప్రదేశ్ లోని మాందసార్‌లో జరిగిన పోలీస్ కాల్పుల్లో రైతులు మరణించాక, "అఖిల భారత సంఘర్ష్ కోఆర్డినేషన్" కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ విభిన్న మార్గాలలో పోరాటాలను నిర్వహించింది.

మార్చి 2018లో నాసిక్ నుండి ముంబై వరకు సుదీర్ఘంగా సాగిన కిసాన్ లాంగ్ మార్చ్, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్వహించబడింది. ఈ లాంగ్ మార్చ్ బిజెపిని ఓడించటం సాధ్యమేనని... బిజెపి అజేయ శక్తి అనే అభిప్రాయం, కేవలం కార్పొరేట్ మీడియా ప్రచార సృష్టి మాత్రమేనని స్పష్టమైన సందేశాన్ని పంపింది. మోడీ నాయకత్వం లోని బి.జె.పి ప్రభుత్వం రైతాంగ వ్యతిరేకి అనే నినాదం, బిజెపి పాలనకు వ్యతిరేకమైన వాతావరణాన్ని సృష్టించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. 2019 సంవత్సరంలో పుల్వామా ఘటన, బాలాకోట్ వైమానిక దాడి ఆ తరువాత...తీవ్ర జాతీయవాద ప్రచార నేపథ్యంలో బిజెపి విజయం సాధించినప్పటికీ...అంతకు ముందు జరిగిన ఎన్నికలలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ లలో బిజెపి ఓటమి పాలైన సంగతిని మరువలేం.

> ఈ సమిష్టి ఉద్యమాలు, ప్రయత్నాలే... నరేంద్ర మోడీ అజేయుడు కాదనే అభిప్రాయాన్ని, విశ్వాసాన్ని ప్రజలలో కలిగించాయి. యువత, విద్యార్థి, మహిళా పోరాటాలు, అణచివేతకు గురైనవారు, సి.ఎ.ఎకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక పోరాటం పాత్ర కూడా ఇందులో ఉంది. అసమ్మతితో కూడిన నిర్భయ స్వరాలు, ఏళ్ళ తరబడి జైళ్ళలో మగ్గుతున్న అనేక మంది కూడా నిస్సందేహంగా ప్రముఖ పాత్ర పోషించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య హక్కుల పరిరక్షణకు... ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించకుండా నిస్వార్థంగా పనిచేసిన వేలాది మందినీ మరువలేం. ధృవ్ రాథీ, రవీష్ కుమార్ వంటి వారితోపాటు వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులు, పౌర సమాజం ఉమ్మడిగా నిర్వహించిన సమిష్టి ప్రయత్నాల ఫలితంగానే, నిరంకుశ బిజెపి తిరస్కరణకు గురైంది. 'రైతాంగ, కార్మిక ఉద్యమాలే' చోదక శక్తిగా నిలిచి, గెలుపు సాధ్యమవుతుందన్న విశ్వాసాన్ని, వాతావరణాన్ని కల్పించాయి.

నరేంద్ర మోడీ రెండవసారి ఎన్నికైన తరువాత, పోరాటాలు తీవ్రమయ్యాయి. తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొని, 750 మంది కామ్రేడ్లు తమ ప్రాణాలను పణంగా పెట్టడం, చారిత్రాత్మక రైతాంగ, కార్మికుల ఐక్య పోరాటాల ఫలితంగా...నరేంద్ర మోడీ అనివార్యంగా తన ఓటమిని అంగీకరించి, కార్పొరేట్ అనుకూల 3 వ్యవసాయ చట్టాలను, 4 లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవడంతో ఉద్యమకారులలో ఆశ చిగురించింది. సంయుక్త కిసాన్ మోర్చా, ఒక వినూత్నమైన సమస్యల ఆధారిత ఐక్యతతో, వర్గాలను అధిగమించి విస్తృత శ్రేణులలోని రైతాంగాన్ని ముందుకు తీసుకు వెళ్లింది. ఈ పోరాటం కరోనా మహమ్మారి కాలంలో జరిగినదని, ఈ వ్యాధిని గురించిన భయంతోపాటు, కఠినమైన లాక్‌డౌన్ వల్ల, పెద్ద సంఖ్యలో ప్రజలు ఇంటికే పరిమితమైన విషయాన్ని ఎవరూ మర్చిపోలేరు. వారు మొదట మహమ్మారి అనే భయంపై విజయం సాధించారు. ఆ తరువాత రాజ్య అణచివేతపై విజయం సాధించారు. మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నప్పుడు, అంతిమ విజయం సాధించడంలో, పాలక వర్గాలు చేసిన ఏ చిన్న ప్రయత్నం కూడా సహాయ పడలేదు. ముజఫర్ నగర్ కిసాన్ మజ్దూర్ మహా పంచాయత్ కార్మికుల, కర్షకుల ఐక్యతతో... బి.జె.పి విభజిత రాజకీయాలను, మతపరమైన ఎజెండాను ఓడిస్తామని స్పష్టంగా ప్రకటించింది. ఎస్.కె.యమ్ కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా, నిర్ణయాత్మకమైన పాత్రను పోషించింది. ఇది మోదానీ మోడల్‌కు వ్యతిరేకం. రైతాంగాన్ని అదానీ, అంబానీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ధీటుగా నిలబెట్టింది. అదానీ, అంబానీలు...మనను పాలించే ప్రభుత్వానికి చెందిన కార్పొరేట్ కుబేరులని చెప్పింది. వారి లాభాల కోసమే, లక్షలాది మంది రైతుల, కార్మికుల ప్రయోజనాలను బలి చేయడానికి నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని తెలిపింది. ఈ సందేశం ప్రతిపక్ష పార్టీలకు కూడా విస్తరించి, ఎన్నికలలో బి.జె.పిని ఓడించడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి.

బి.జె.పిని శిక్షించాలనే కిసాన్ సంయుక్త మోర్చా నినాదం దేశవ్యాప్తంగా విస్తరించింది. బి.జె.పి కార్పొరేట్ అనుకూల, మతతత్వ విధానాలను బహిర్గతం చేస్తూ యస్.కె.యమ్-జె.పి.సి.టి.యు అనేక రకాల ప్రచారాలను చేపట్టాయి. అగ్నివీర్ పథకానికి వ్యతిరేకంగా ప్రచారం, మహిళా రెజ్లర్ల పట్ల వ్యవహరించిన తీరుతో పాటు, ఇతర సమస్యలను కూడా చేపట్టాయి. పంజాబ్, హర్యానాలలో రైతుల నిరసనలతో బిజెపి అభ్యర్థులు ఎన్నికల ప్రచారం కోసం, గ్రామీణ ప్రాంతాలలోనికి రాలేకపోయారు. ట్రేడ్ యూనియన్ల సమన్వయంతో విస్తృత సాహిత్యం, పోస్టర్లు, ప్రచారం నిర్వహించారు. లఖింపూర్ ఖేరి ఘటనకు కారణమైన, ఐదుగురు రైతులను, ఒక జర్నలిస్టును వాహనంతో తొక్కించి వారి మరణానికి కారణమైన అజయ్ మిశ్రా తేని కుమారుడిపై అవిశ్రాంత పోరాటం చేశారు.

ఎన్నికల ఫలితాలపై ఈ ప్రచారాలన్నింటి ప్రభావం ఉంది. రైతాంగ ఉద్యమాలకు, పోరాటాలకు ప్రధాన కేంద్రాలుగా ఉన్న, పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో, చాలా గ్రామీణ నియోజక వర్గాలలో, బిజెపి ఘోరంగా ఓడిపోయింది. 'న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో జితేంద్ర చౌబే నివేదిక ప్రకారం, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాజస్థాన్, హర్యానా, మహారాష్ట్రలోని ఐదు రాష్ట్రాల వ్యవసాయ బెల్టులలో బిజెపి 38 సీట్లను కోల్పోయింది. పశ్చిమ యూపీలో ముజఫర్ నగర్, సహారాన్పూర్, కైరానా, నగీనా, మురాదాబాద్, సంభాల్, రాంపూర్, మరీ ముఖ్యంగా అజయ్ మిశ్రా తేని, లఖింపూర్ ఖేరిలో ఎన్నికలలో ఓడిపోయాడు. పంజాబ్‌లో ఒక్క సీటు కూడా గెలవలేని బిజెపి, హర్యానాలో ఐదు సీట్లు కోల్పోయింది. రాజస్థాన్‌లో గత ఎన్నికలలో, బి.జె.పి మొత్తం 25 స్థానాలలో విజయం సాధించగా, వ్యవసాయ ఆధారిత ప్రాంతంలో బిజెపి 11 స్థానాలను కోల్పోయింది. మహారాష్ట్రలోని ఉల్లిగడ్డల సాగు జరుగుతున్న ప్రాంతంలో, ఇద్దరు కేంద్ర మంత్రులు ఓడిపోయారు. ఎన్.డి.ఎ 12 సీట్లు కోల్పోగా, బి.జె.పి కి ఒక్క సీటు కూడా రాలేదు. వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా కూడా జార్ఖండ్‌లో ఓడిపోయారు. రైతాంగ పోరాటంలో ముఖ్య నాయకులు, ఆల్ ఇండియా కిసాన్ సభ ఉపాధ్యక్షులు, రాజస్థాన్ లోని షాజహాన్ పూర్ సరిహద్దులలో 13 నెలల పాటు పోరాటానికి నాయకత్వం వహించిన అమ్రారామ్, సికార్ లోక్‌సభ నియోజకవర్గం నుండి సి.పి.యం అభ్యర్థిగా, 'ఇండియా' వేదిక మద్దతుతో విజయం సాధించారు. బీహార్‌లో కూడా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులకు, ఉమ్మడి పోరులో నికరమైన మద్దతునిచ్చిన, ముఖ్యమైన నాయకుడు ఆల్ ఇండియా కిసాన్ మహాసభ జనరల్ సెక్రెటరీ రాజారాం సింగ్, మరొక నాయకుడు సుధామ ప్రసాద్ కరాకట్, అర్రాహ్ నుండి 'ఇండియా' వేదిక మద్దతుతో ఎన్నికయ్యారు. వీరు సి.పి.ఐ ఎంఎల్ లిబరేషన్ అభ్యర్థులు. మహారాష్ట్రలోని వ్యవసాయ ఆధారిత ప్రాంతంలో బిజెపి 12 సీట్లను కోల్పోయింది. తమిళనాడు లోని దిండిగల్ నుండి 4 లక్షల పైగా ఓట్లతో గెలుపొందిన సి.పి.ఐ ఎం అభ్యర్థి సచ్చిదానందంకు కూడా 'ఇండియా' బ్లాక్ మద్దతునిచ్చింది. ఆయన ఆలిండియా కిసాన్ సభ నాయకుడు కూడా. ఇతర రాష్ట్రాలను పరిశీలించినా ఈ పోరాటాల ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తుంది.

వాస్తవంగా, ఈ సమిష్టి ఉద్యమాలు, ప్రయత్నాలే... నరేంద్ర మోడీ అజేయుడు కాదనే అభిప్రాయాన్ని, విశ్వాసాన్ని ప్రజలలో కలిగించాయి. యువత, విద్యార్థి, మహిళా పోరాటాలు, అణచివేతకు గురయినవారు, సి.ఎ.ఎకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక పోరాటం పాత్ర కూడా ఇందులో ఉంది. అసమ్మతితో కూడిన నిర్భయ స్వరాలు, ఏళ్ళ తరబడి జైళ్ళలో మగ్గుతున్న అనేక మంది కూడా, నిస్సందేహంగా ప్రముఖ పాత్ర పోషించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య హక్కుల పరిరక్షణకు...ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించకుండా నిస్వార్థంగా పనిచేసిన వేలాది మందినీ మరువలేం. ధృవ్ రాథీ, రవీష్ కుమార్ వంటి వారితోపాటు వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులు, పౌర సమాజం ఉమ్మడిగా నిర్వహించిన సమిష్టి ప్రయత్నాల ఫలితంగానే, నిరంకుశ బిజెపి తిరస్కరణకు గురైంది. రైతాంగ, కార్మిక ఉద్యమాలే' చోదక శక్తిగా నిలిచి, గెలుపు సాధ్యమవుతుందన్న విశ్వాసాన్ని, వాతావరణాన్ని కల్పించాయి.

(వ్యాసకర్త అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి)

చైనా-రష్యాలను మరింత దగ్గర చేసిన జి7 !

అంతర్జాతీయం

ఇటలీలోని అపూలియాలో 2024 జూన్ 13-15 తేదీలలో జరిగిన జి7 యాభయ్యవ శిఖరాగ్ర వార్షిక సమావేశ తీరుతెన్నులు, పరిణామాలు, పర్యవసానాల గురించి చర్చ జరుగుతున్నది. ఈ సమావేశాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా భారత ప్రధాని నరేంద్రమోడీతో సహ పన్నెండు దేశాధినేతలను, ఆఫ్రికా యూనియన్ ప్రతినిధిని ఆహ్వానించారు. ఇలాంటి వేదికలన్నింటా పూసల్లో దారంలా ప్రపంచ దేశాల బలాబలాల సమీకరణ లక్ష్యం ఉంటుంది. ధనిక దేశాలు తమకు సవాలు విసురుతున్న చైనా, రష్యాలను దెబ్బ తీసేందుకుగాను వర్ధమాన, పేద దేశాలను తమ వైపు తిప్పుకొనేందుకు అపూలియాలో గట్టి ప్రయత్నమే చేసినా ఫలితం ఏమిటన్నది ప్రశ్నార్థకమే. అనేక అంశాల మీద ఈ కూటమి ఒక ప్రకటన చేసినప్పటికీ దానిలో ప్రధానమైన వాటిని చూద్దాం. ఆతిథ్యం ఇచ్చిన దేశం తనకు నచ్చిన, తాను మెచ్చిన వారిని ప్రత్యేకంగా ఆహ్వానిస్తుంది. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆహ్వానం మేరకు అల్జీరియా, అర్జెంటీనా, బ్రెజిల్, భారత్, జోర్డాన్, కెన్యా, మారిటేనియా, ఆఫ్రికన్ యూనియన్, ట్యునీసియా, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉక్రెయిన్, వాటికన్ నగరం నుంచి అధిపతులు వచ్చారు. ప్రపంచంలో రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా, రష్యా దేశాలకు ఆహ్వానం లేనప్పటికీ మూడు రోజుల సమావేశాలు వాటి నామజపంతోనే ముగిశాయంటే అతిశయోక్తి కాదు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు కారణం చైనా అని నెపం నెట్టేందుకు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు పశ్చిమ దేశాలు చూస్తున్నాయి.

ఎం. కోటేశ్వరరావు

చైనాను దెబ్బతీసేందుకు మిత్రదేశాలను అమెరికా ఎలా కూడగడుతున్నదో తనను తాను రక్షించుకొనేందుకు బీజింగ్ కూడా అదే చేయనుందని వేరే చెప్పనవసరం లేదు. "ఆరుగురు అసమర్థులు మరియు జార్జియా మెలోనీ 2024 జి7 తరగతిలో కూడిక " అన్న శీర్షికతో పొలిటికో పత్రిక ఒక బలహీన సమావేశం అంటూ విశ్లేషణ రాసింది. ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో పచ్చి మితవాద పార్టీలు బలపడటంతో ఫ్రెంచి అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఏకంగా పార్లమెంటును రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు వెళ్లాడు. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కూడా అంతకు ముందే అదే పని చేశాడు. జర్మనీ ఛాన్సలర్ షుఉల్జ్ కూడా చావు దెబ్బతిన్నాడు, ఎప్పుడైనా అదేపని చేయవచ్చు. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్ పదవి నుంచి తప్పుకోనున్నట్లు బహిరంగంగానే ప్రకటించాడు. జపాన్ ప్రధాని ఫుమియో కిషిడా పలుకుబడి అధ్వాన్నంగా ఉంది. అమెరికా ఎన్నికల్లో జో బైడెన్ తిరిగి అధికారానికి రావటం అనుమానమే. ఇలాంటి వాటన్నింటినీ మూసిపెట్టేందుకు రష్యాతో పాటు చైనాను కూడా బూచిగా చూపేందుకు కసరత్తు చేశారు.

> ఉక్రెయిన్-రష్యా వివాదం ప్రధాన అంశంగా ముందుకు వచ్చింది. అయితే దాన్ని పరిష్కరించటానికి బదులు మరింత ఎగదోసేదిగా కనిపించింది. ఈ సమావేశం ఫలితాలు, పర్యవసానాల విషయానికి వస్తే ఇప్పటికే దగ్గరైన చైనా-రష్యాలను మరింత దగ్గరగా చేసేందుకు దోహదం చేసిందని చెప్పవచ్చు.

ఉక్రెయిన్-రష్యా వివాదం ప్రధాన అంశంగా ముందుకు వచ్చింది. అయితే దాన్ని పరిష్కరించటానికి బదులు మరింత ఎగదోసేదిగా కనిపించింది. ఈ సమావేశం ఫలితాలు, పర్యవసానాల విషయానికి వస్తే ఇప్పటికే దగ్గరైన చైనా-రష్యాలను మరింత దగ్గరగా చేసేందుకు దోహదం చేసిందని చెప్పవచ్చు. ఉక్రెయిన్ యుద్ధంలో చైనా ఆయుధాలను రష్యాకు సరఫరా చేయటం లేదు. కానీ వాటిని ఉత్పత్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, సామర్థ్యాన్ని సమకూరుస్తున్నది. కాబట్టి నిజానికి అది రష్యాకు సాయం చేయటమే అని జో బైడెన్ విలేకర్ల సమావేశంలో చెప్పాడు. రష్యా యుద్ధ యంత్రాంగ రక్షకురాలిగా చిత్రించటం తప్ప మరొకటి కాదు. గత కొద్ది సంవత్సరాలుగా చైనా మీద సాగిస్తున్న విమర్శ మరింత పదును తేలింది. గత రెండు సమావేశాల్లో చైనా పాత్ర గురించి దాదాపు లేవనెత్తలేదని, ఉక్రెయిన్‌పై వ్లదిమిర్ పుతిన్ అణ్వాయుధాన్ని పేల్చుతారన్న భయాలు తలెత్తినపుడు సీ జిన్‌పింగ్ అంత దాకా పోనివ్వని నియంత్రణ శక్తిగా భావించారని, ఈసారి దానికి భిన్నంగా సమావేశ ప్రకటన ప్రారంభమైందని న్యూయార్క్ టైమ్స్ వ్యాఖ్యానించింది. రష్యా యుద్ధ యంత్రాంగానికి వస్తు సరఫరా చేస్తున్న చైనా, మూడవ పక్ష దేశాల సంస్థలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవటం కొనసాగిస్తామని ప్రకటనలో పేర్కొన్నట్లు ఉటంకించింది. గత సమావేశాల్లో వాతావరణ ప్రతికూల మార్పులను అడ్డుకొనేందుకు, ఉగ్రవాదం, అణ్వాయుధ నిరోధం కోసం చైనాతో చేతులు కలుపుతామంటూ మాట్లాడిన ధనిక దేశాలు ఇప్పుడు శత్రువుగా చూస్తున్నాయంటే ఆ సమస్యల పట్ల వాటి చిత్తశుద్ధి ఏమిటో స్వయంగా వెల్లడించుకున్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ సీ జిన్‌పింగ్ చైనా ఆధిపత్య లక్ష్యంతో పనిచేస్తున్నట్లు అపూలియా అంతరంగిక సమావేశంలో అభిప్రాయపడినట్లు అమెరికా అధికారి ఒకరు విలేకర్లతో చెప్పాడు. ఉక్రెయిన్ వివాదంలో చైనా పాత్ర గురించి సీ జిన్‌పింగ్ వైఖరిలో గత ఏడాది కాలంలో మార్పు వచ్చినట్లు అమెరికా ప్రచారం చేస్తున్నది. రష్యాతో అవధులు లేని భాగస్వామ్యంగా ప్రకటించినప్పటి నుంచి అది ప్రారంభమైందని ఆరోపిస్తోంది. స్విట్జర్లాండ్‌లో పశ్చిమ దేశాలు నిర్వహించిన ఉక్రెయిన్ శాంతి సదస్సులో పాల్గొనవద్దని దేశాలను నిరుత్సాహ పరచిందని కూడా ఆరోపించింది. చిత్రం ఏమిటంటే ఈ సమావేశంలో భాగస్వామిగా ఉన్న మన దేశం సమావేశ ప్రకటనను ఆమోదించటానికి తిరస్కరించింది. దీని వెనుక కూడా చైనా హస్తం ఉందని చెప్పగలరా?

చైనా మీద వ్యతిరేకతను పెంచేందుకు చేయని తప్పుడు ప్రచారం లేదు. అవసరమైనపుడు అమెరికా, ఐరోపా దేశాలలోని అన్నిరకాల వ్యవస్థలను పని చేయకుండా చేసేందుకు వాటిలో కంప్యూటర్ వైరస్‌లను పెట్టి సిద్ధంగా ఉంచిందని అమెరికా ఆరోపించింది. దీనికి "ఓల్ట్ టైఫూన్ " అనే పేరు పెట్టారు. దీని ప్రకారం విద్యుత్, నీరు, రేవుల వంటి వ్యవస్థలను అమెరికా, దాని మిత్ర దేశాలలో పని చేయకుండా చేసేందుకు చైనా ఒక ప్రోగ్రామ్‌ను రూపొందించి సదరు వ్యవస్థలలో ప్రవేశ పెట్టినట్లు ప్రచారం చేస్తున్నారు. ఐ.టి, అన్ని రకాల సాంకేతిక రంగాలలో తమను మించిన వారు లేరని విర్రవీగుతున్న పశ్చిమ దేశాలు తమ వ్యవస్థలకు రక్షణ ఏర్పాట్లు చేసుకోలేనంత అసమర్థంగా ఉన్నాయా? అంటే ఎవరూ నమ్మరు. చైనాను బూచిగా చూపి జనంలో దిగజారుతున్న తమ పలుకుబడిని నిలుపుకొనేందుకు, ఆర్థిక వైఫల్యాలను కప్పి పుచ్చుకొనేందుకు ఒక మైండ్ గేమ్ తప్ప మరొకటి కాదు. ఒకవేళ బలవంతంగా తైవాన్ విలీనానికి చైనా పూనుకుంటే అక్కడి చిప్స్ తయారీ కేంద్రాలను పేల్చివేస్తామని అమెరికా బెదిరించిన సంగతి తెలిసిందే. అందువలన ఒకవేళ నిజంగా చైనా అలాంటి వైరస్‌ను చొప్పించిందంటే దెబ్బకు దెబ్బ తీసే జాగ్రత్త అని అర్థం చేసుకోవాలి. అవసరానికి మించి చైనా ఉత్పత్తులు చేస్తున్నదనే ప్రచారం కూడా పెద్ద ఎత్తున పశ్చిమ దేశాలు చేస్తున్నాయి. చైనా నిబంధనలను ఉల్లంఘిస్తున్నది అనుకుంటే ప్రపంచ వాణిజ్య సంస్థలో ఫిర్యాదు చేయవచ్చు. అమెరికా, ఐరోపా యూనియన్ కూడా చైనా ఉత్పత్తుల మీద దిగుమతి పన్నులను పెంచి రక్షణాత్మక చర్యలు తీసుకొని కూడా గగ్గోలు పెడుతున్నాయి. తమ బలహీనతలను కప్పిపుచ్చుకొనేందుకు తమ మీద నిందలు వేస్తున్నట్లు చైనా విమర్శిస్తున్నది.

ఇక భారత్ ఈ కూటమి సభ్యదేశంగా చేరనుందనే భావం కల్పిస్తూ కొందరు విశ్లేషణలు చేస్తున్నారు. ఏ ఒక్క దేశమూ ఈ గ్రూపును విస్తరించే ప్రతిపాదనలు ముందుకు తేలేదు. ఒకవేళ విస్తరించినా మన దేశాన్ని చేర్చుకుంటారన్నది సందేహమే. ఆ గ్రూపు లోని ఐదు దేశాల జిడిపి కంటే మనది ఎక్కువగా ఉన్నది తప్ప ధనిక దేశ వర్గీకరణకు ఎంతో దూరంలో ఉంది. యాభై ఏళ్లుగా ఉన్న ఆ బృందం ప్రపంచ పరిణామాలను నియంత్రించటంలో నానాటికీ బలహీన పడుతున్న తరుణంలో మన దేశం చేరినంత మాత్రాన మన జనానికి ఒరిగేదేమిటి? ఒకవేళ నిజంగా చేరితే చైనా, రష్యాలతో ఒక శత్రు కూటమిగా మన దేశం కూడా లడాయికి దిగటమే. అటువంటి దుస్సాహసానికి నరేంద్ర మోడీ పాల్పడతారా?

అభిప్రాయం

సికిల్ సెల్ ఎనీమియా
అవగాహనే ఔషధం

జన్యుపరమైన ఎర్ర రక్త కణాల రుగ్మతను సికిల్ సెల్ వ్యాధి లేదా కొడవలి కణ రక్తహీనత లేదా సికిల్ సెల్ ఎనీమియా' అని పిలుస్తారు. శరీర కణజాలానికి ప్రాణ వాయువును అందించే గుండ్రని ఆకారం కలిగిన ఎర్ర రక్త కణాలు... జన్యు సంబంధ కారణంగా అసాధారణ కొడవలి లేదా సికిల్ ఆకారంలోకి మారడంతో... రక్తనాళాలు మూసుకొనిపోయి ప్రమాదకర సమస్యలు బయట పడడం చూస్తున్నాం. సికిల్ సెల్ ఉన్న వారిలో ఒక జన్యువు కొడవలి లేదా చంద్రవంక ఆకారంలో, మరొకటి సాధారణ ఆకారంలో ఉన్నట్లయితే వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారు. వీరికి ఎలాంటి అనారోగ్యాలు కలగవు. కాని ఇలాంటి లక్షణాలు కలిగిన ఇద్దరికి జన్మించే సంతానంలో రెండు జన్యువులూ కొడవలి ఆకారంలోకి మారడంతో ప్రమాదకర సమస్యలు ప్రారంభం అవుతాయి. పుట్టిన పిల్లలకు 5-6 నెలల వరకు ఈ వ్యాధి లక్షణాలు కనిపించవు. వయస్సు పెరిగే కొద్దీ వ్యాధి లక్షణాలు బయట పడతాయి. సాధారణ రక్తనాళాల జీవితకాలం 120 రోజుల వరకు ఉంటే సికిల్ రక్త కణాల జీవితకాలం 20 నుంచి 25 రోజులు మాత్రమే ఉంటుంది. సికిల్ సెల్స్ కొడవలి ఆకారంలో ఉండడంతో రక్తనాళాల్లో సరిగ్గా ప్రవహించకపోవడం, తగు చికిత్స లేదా మందులు లేకపోవడం వల్ల శరీర కణజాలాలకు ప్రాణవాయువు సరఫరా తగ్గిపోతూ 15 ఏళ్ల లోపునే చనిపోతుంటారు. సికిల్ సెల్ కట్టడి కోసం ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం, క్యారియర్ల మధ్య పెళ్లిళ్ళు జరుగకుండా అవగాహన కల్పించడం, వ్యాధితో బాధపడుతున్న రోగులకు సరైన వైద్య సదుపాయాలు కల్పించడం నిరంతరం జరగాలి.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
సెల్ : 9949700037

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

అదంతా ఓ నాటకం

- రాజ్యాంగాన్ని మోడీ ముఖానికి అద్దుకోవడంపై దుష్యంత్ దవే

ప్రజాశక్తి - న్యూఢిల్లీ : మూడోసారి ప్రధాని పదవి చేపట్టిన తరువాత నరేంద్ర మోడీ రాజ్యాంగాన్ని ముఖానికి అద్దుకోవడం, రాజ్యాంగం పట్ల కొత్తగా కనపరుస్తున్న భక్తి.... అదంతా ఓ నాటకమని జర్నలిస్టు దుష్యంత్ దవే విమర్శించారు. ఒక ఆంగ్ల దినపత్రిక (ది హిందూ) లో దవే తన అభిప్రాయాలను ఒక వ్యాసం రూపంలో వెల్లడించారు.

ఈ నెల 7న ఎన్‌డిఎ కూటమి సమావేశం నూతన పార్లమెంటు భవనంలోని సంవిధాన్ సదన్ (రాజ్యాంగ వేదిక) లో జరగడం, వేదికపైకి రాగానే భారత రాజ్యాంగ ప్రతిని మోడీ కళ్ళకు అద్దుకుని, నుదుటికి తాకించి భక్తిని ప్రదర్శించారు. ఇది అంతా ఒక నాటకమేనని దుష్యంత్ దవే తెలిపారు. నిజానికి 2014 నుండీ ప్రధానిగా వ్యవహరించిన కాలంలో గాని, అంతకు ముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గాని నరేంద్ర మోడీ ఏనాడూ రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించడం గాని, దానికి కట్టుబడి పని చేయడం గాని జరగలేదన్నారు.

తాజా గా జరిగిన సందర్భాలను ప్రస్తావిస్తూ, జూన్ 8న ప్రధాని, మంత్రివర్గ సహచరులు ప్రమాణస్వీకారం చేశారని, కాని జూన్ 10 న మాత్రమే మంత్రుల శాఖలను కేటాయించారని గుర్తు చేశారు. కాని జూన్ 9వ తేదీనే మోడీ ప్రధాన్‌మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రు.20,000 కోట్లు విడుదల చేస్తూ తొలి సంతకం చేశారని, వ్యవసాయ మంత్రిత్వ శాఖ పరిధి కింద వచ్చే ఆ స్కీముకు ఆర్థిక శాఖ లో వివిధ వ్యయాలను నియంత్రించే శాఖ కూడా ఆమోదం తెలిపినప్పుడే నిధులను విడుదల చేయాల్సివుందని దవే అన్నారు. కాని ఆ రెండు శాఖలకు మంత్రులు ఎవరో ప్రకటించకుండానే అన్నీ తానే అయినట్టు మోడీ ఫైలుపై సంతకం చేయడం ప్రభుత్వ బిజినెస్ రూల్స్‌ను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. ఇదంతా చేస్తూనే తాను రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నట్టు చిత్రించుకునే నాటకం మోడీ నడుపుతున్నారని అన్నారు.

ఆ యా మంత్రుల శాఖలను నిర్ణయించకుండానే తొలి కాబినెట్ సమావేశం జరిగింది. అందులో అదనంగా 3 కోట్ల గృహాలను ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరు చేస్తున్నట్టు నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనను చేయవలసినది సంబంధిత మంత్రి. ఆ శాఖకు ఎవరు మంత్రో నిర్ణయం కాకుండానే కాబినెట్ లో నిర్ణయం ఎలా తీసుకుంటారు ? ఆ యా మంత్రివర్గ ఉపసంఘాలను కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. అలా చేయకమునుపే ప్రధాని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పదవీకాలాన్ని పొడిగించేశారు. అలాగే తన ప్రధానకార్యదర్శి పదవీకాలాన్ని కూడా. క్యాబినెట్ నియామకాల పసంఘం పేరుతో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కాని అటువంటి ఉపసంఘాన్ని ఇంకా ఏర్పాటు చేయలేదు.

సంకీర్ణధర్మం మాటేమిటి ?

గడిచిన నాలుగైదు రోజుల్లోనే రాజ్యాంగం నిర్దేశించిన విధివిధానాలను తోసిరాజంటూ మోడీ ఈ విధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తూంటే ఒక్క మంత్రి గాని, ఒక్క సీనియర్ బ్యూరోక్రాట్ గాని అభ్యంతరం చెప్పలేదు. "ప్రభుత్వ వ్యవహారాలనునిర్వహించేందుకు అవసరమైన నిబంధనలను, ఆ బాధ్యతలలో వేటిని ఏ యే మంత్రులు నిర్వర్తిస్తారో ఆ నిర్ణయాన్ని దేశాధ్యక్షుడు తీసుకుంటార"ని రాజ్యాంగంలోని 77వ అధికరణం చెప్తోంది. అంతేగాక మంత్రివర్గానికి సమిష్టి బాధ్యత ఉంటుందని రాజ్యాంగం తెలియజేస్తోంది. కాని దానికి విరుద్ధంగా ప్రధానమంత్రి కార్యాలయం వద్ద అన్ని అధికారాలూ కేంద్రీకృతం అయిపోతున్నాయని దుష్యంత్ దవే విమర్శించారు. నిజానికి పిఎంవో కార్యాలయానికి ఉన్న బాధ్యత అంతా ప్రధానికి సహాయపడడం మాత్రమేనని, ప్రభుత్వ వ్యవహారాలను ఆ యా మంత్రిత్వ శాఖలు నిర్వర్తిస్తాయని బిజినెస్ రూల్స్ చెప్తున్నాయి.

పదేళ్ళ తర్వాత మళ్ళీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. తమ మద్దతు మీదనే ఈ ప్రభుత్వం ఆధారపడివుందని మిత్రపక్షాలు చెప్పుకుంటున్నాయి. కాని నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఆ మిత్ర పక్షాలను సంప్రదించడం, ఉమ్మడి ఆమోదంతో నిర్ణయాలు జరగడం అనే సంకీర్ణధర్మం ఎక్కడా కనిపించడం లేదు. సర్వమూ ప్రధాని కార్యాలయమే అయిపోయింది.

నిజజీవితంలో భక్తి అనేది ముక్తి పొందడానికి తోడ్పడుతుందేమో గాని, రాజకీయాలలో భక్తి అనేది నియంతృత్వానికి దారి తీసే సాధనంగా ఉపయోగపడుతుంది అని బి ఆర్ అంబేద్కర్ అన్న మాటలను దవే గుర్తు చేశారు. ఇప్పుడు రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని నియంతృత్వం చెలాయిస్తున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాతలు ఇటువంటి ధోరణులను తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి గుర్తు చేశారు.

మణిపూర్ లో జరుగుతున్న ఘర్షణలను ప్రస్తావిస్తూ, ఇంతవరకు ప్రధాని మణిపూర్ లో పర్యటించలేదని, అదే మణిపూర్ లో గనుక ప్రతిపక్ష ప్రభుత్వం ఉండివుంటే, అల్లర్లు మొదలవగానే 356 అధికరణాన్ని ప్రయోగించి అక్కడి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసేసివుండేవారని అన్నారు దవే. అత్యవసర సమస్యలుగా నేడు మనముందు ఉన్న మణిపూర్, కాశ్మీర్ వంటి ప్రాంతాలు కాని, దేశవ్యాప్తంగా తీవ్ర సమస్యలుగా ఉన్న పేదరికం, నిరుద్యోగం వంటివి కాని చేపట్టి వాటిపై వెనువెంటనే నిర్ణయాలను మోడీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అటువంటి సమస్యల పరిష్కారం బాధ్యతతో కూడిన విషయం అని, వాటిని గనుక చేపడితే తానేదో కష్టపడి పని చేసేస్తున్నట్టు ప్రజలను నమ్మించడం మోడీవలన అయేపని కాదని, అందుకే కీలక సమస్యలను వదలిపెట్టి ప్రజలను భ్రమింపజేస్తున్నారని అన్నారు.

మన రాజ్యాంగం లౌకిక ధర్మం మీద ఆధారపడివుందని, ప్రధాని ఇటీవలి ఎన్నికల ప్రసంగాలలో ఆ ధర్మాన్ని పూర్తిగా ఉల్లంఘించి ముస్లిం మైనారిటీలపై పదే పదే విద్వేషపూరిత ప్రసంగాలు చేసి రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని, ఎన్నికల చట్టాలు గనుక ఖచ్చితంగా అమలైవుంటే మోడీ పార్లమెంటు సభ్యుడిగా కొనసాగే అర్హతను కోల్పోయివుండేవారని దుష్యంత్ దవే అన్నారు.

ఇన్నాళ్ళూ ఎన్డీయే మిత్ర పక్షాలు మోడీ రాజ్యాంగవిరుద్ధ పనితీరును ఎక్కడా నోరెత్తి ప్రశ్నించలేదని దవే అన్నారు. సంకీర్ణధర్మాన్ని మోడీ పాటించినా, పాటించకపోయినా, కనీసం సంకీర్ణంలో ఉన్న ఇతర రాజకీయ పక్షాలైనా ఆ ధర్మాన్ని అనుసరించి మోడీని ప్రశ్నిస్తాయా అన్నది చూడాలి అని వ్యాఖ్యానించారు.

జియో నెట్‌వర్క్ సేవల్లో అంతరాయం

- కస్టమర్ కేర్ స్పందన కరువు

ముంబయి : ముకేష్ అంబానీకి చెందిన రియలన్స్ జియో మొబైల్ నెట్‌వర్క్‌తో పాటు జియో ఫైబర్ సేవలకూ అంతరాయం ఏర్పాడింది. దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి సమస్య ఉత్పన్నం కావడంతో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. జియో ఫైబర్, మొబైల్ ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్ సేవల్లో అంతరాయం చోటు చేసుకుంది. దీనికి గల స్పష్టమైన కారణాలను ఆ కంపెనీ వెల్లడించలేదు. సేవలపై వినియోగదారులు కస్టమర్ కేర్‌ను సంప్రదించిన సరిగా స్పందించడం లేదంటూ వాపోయారు. ఇతర నెట్‌వర్క్‌ల సహాయంతో సోషల్ మీడియా వేదికల్లో తమ ఆందోళనను వ్యక్తం చేశారు. జియో సర్వీసులు నిలిపోవడంతో మీమ్స్ వెల్లువెత్తాయి. దాదాపు 3వేల మందికిపైగా జియో సర్వీసులు పని చేయడం లేదని ఫిర్యాదు చేశారు. జియో నెట్‌వర్క్ డౌన్ కావడంతో మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో వాట్సాప్ పని చేయకుండా పోయింది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఎక్స్, గూగుల్, యూట్యూబ్ సహా పలు సర్వీలను వినియోగించుకోలేకపోయామని వినియోగదారులు ఆందోళన పడ్డారు.

కాంచనగంగ రైలు ప్రమాదంలో 10కి చేరిన మృతుల సంఖ్య

సిలిగురి : పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం జరిగిన కాంచనగంగ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి చేరుకుంది. ఈ విషయాన్ని అధికారులు మంగళవారం వెల్లడించారు. ప్రమాద స్థలంలోనే మృతి చెందిన ఎనిమిది మంది మృతదేహాలను సిలిగురిలోని నార్త్ బెంగాల్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పటల్ (ఎన్‌బిఎంసిహెచ్)కు తరలించారు. మరో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు. వీరిలో ఒకరు ఆరేళ్ల బాలిక అని ఎన్‌బిఎంసిహెచ్ డీన్ డాక్టర్ సందీప్ సేన్‌గుప్తా తెలిపారు. ఆరేళ్ల బాలికను తీవ్రగాయాలతో ఆసుపత్రికి తీసుకొచ్చారని, చికిత్స పొందుతూ మరణించిందని చెప్పారు. మొత్తంగా ఈ రైలు ప్రమాదానికి సంబంధించి 37 మంది గాయాలతో ఆసుపత్రిలో చేరారని, ఇందులో ఇద్దరు ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారని తెలిపారు.

మణిపూర్‌లో బస్సుకు నిప్పు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ ఇంకా కొనసాగుతూనే ఉంది. సాయుధ దుండగులు ఇంకా రెచ్చిపోతూనే ఉన్నారు. తాజాగా సిఆర్‌పిఎఫ్ జవాన్లతో వెళుతున్న బస్సును అడ్డగించిన దుండగులు బస్సులో ఉన్న జవాన్లందర్నీ కిందకు దిగమని చెప్పి తరువాత బస్సును దగ్ధం చేశారు. కాంగ్పోక్పి జిల్లాలో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఈ ఘటనపై కాంగ్పోక్పి పోలీసుస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదైంది. ఇది ఒక అద్దె బస్సు అని, సిఆర్‌పిఎఫ్ జవాన్లతో ఈ బస్సు ప్రయాణం చేస్తుందని పోలీసులు చెప్పారు. గతవారం బిష్ణుపూర్ జిల్లాలో రెండు ట్రక్కులను దగ్ధం చేసినందుకు ప్రతీకారంగా ఈ ఘటన జరిగిందని పోలీసులు చెబుతున్నారు. మణిపూర్‌లో గత ఏడాది మే నుంచి హింసాకాండ జరుగుతున్న సంగతి తెలిసిందే.

కేంద్ర మంత్రిగా శ్రీనివాస వర్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

యువతకు పరిశ్రమలతో ఉపాధి కల్పించడమే తన లక్ష్యమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం నాడిక్కడ ఉద్యోగ్ భవన్‌లో కేంద్ర సహాయ మంత్రిగా శ్రీనివాస వర్మ బాధ్యతలు స్వీకరించారు. తన ఛాంబర్‌లో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కేంద్ర మంత్రిగా సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎపి బిజెపి ఎమ్మెల్యే సుజనా చౌదరి, అరమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, సోము వీర్రాజు ఇతర ముఖ్యనేతలు హాజరయ్యారు. అనంతరం శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ప్రధాని మోడీ కేటాయించిన ఈ రెండు శాఖలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. తెలుగు రాష్ట్రాల నుంచి వెనక్కి వెళ్లిన పరిశ్రమలను తిరిగి వచ్చేలా కృషి చేస్తానన్నారు. అనంతరం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కలిశారు.

మత ఘర్షణలతో బాలాసోర్‌లో నిషేధాజ్ఞలు

భువనేశ్వర్ : ఒడిషాలో బిజెపి అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే మత ఘర్షణలు చెలరేగడంతో బాలాసోర్ పట్టణంలో సిఆర్‌పిసి సెక్షన్ 144 కింద సోమవారం ఒడిశా ప్రభుత్వం నిషేధపు ఉత్తర్వులు విధించింది. సమాధి సమీపంలో డ్రెయిర్ వాటర్ ఎర్రగా మారాయంటూ హిందూ కమ్యూనిటీకి చెందిన కొందరు ఆందోళనకు దిగారు. ఈద్ అల్ ఉదా వేడుకల సందర్భంగా ఆవులను వధించారంటూ ఆరోపించారు. ఈ వార్త పట్టణంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున ఆందోళనకారులు అక్కడికి చేరుకుని చాందిపూర్ -బాలాసోర్ ప్రధాన రహదారిని ముట్టడించారు. ఇది తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడంతో హిందూ ముస్లిం వర్గాలు ఒకరిపై మరొకరు రాళ్ళు రువ్వుకున్నాయి. ఈ ఘటనలో భద్రతా సిబ్బంది సహా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. వాహనాలు ధ్వంసమయ్యాయి. ఉద్రిక్తతల దృష్ట్యా బాలాసోర్‌లోని పీర్ బజార్ నుండి పత్రపాడ వరకు ఉన్న ప్రాంతంలో 144 సెక్షన్ కింద నిషేధపు ఉత్తర్వులు విధించింది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, ఇరు కమ్యూనిటీల మధ్య ఘర్షణకు కారణమైన నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని బాలాసోర్ కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు కూడా నేడు సెలవు ప్రకటించింది.

మహిళలపై దాడులు యుపిలోనే అధికం

- ఈ ఏడాదిలో ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్‌కు 12,600 ఫిర్యాదులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు)కు ఈ ఏడాది సుమారు 12,600 ఫిర్యాదులు అందాయి. దీంట్లో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి ఫిర్యాదులు నమోదయ్యాయి. ఎన్‌సిడబ్ల్యు రైట్ టు డిగ్నిటీ కింద ఎక్కువ ఫిర్యాదులు అందుకున్నట్లు డేటాలో వెల్లడించారు. దీంట్లో గృహహింస కాకుండా ఇతర వేధింపులు రానున్నాయి. ఇలాంటివి సుమారు 3,107 ఫిర్యాదులు ఉన్నట్లు ఎన్‌సిడబ్ల్యు డేటా ప్రకారం తెలుస్తోంది. వరకట్న వేధింపులు కింద నమోదైన ఫిర్యాదులు 1,957 ఉన్నాయి. వేధింపులు 817, మహిళల పట్ల పోలీసుల వైఖరిలో 518, అత్యాచారం కింద 657 ఫిర్యాదులు ఉన్నాయి. లైంగిక వేధింపుల కింద 493, సైబర్ క్రైం కింద 339, వెంబడించడం లాంటివి 345, హానర్ క్రైం కింద 206 ఫిర్యాదులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి మొత్తం 6,470 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఆ తరువాత స్థానంలో ఢిల్లీ నిలిచింది. ఢిల్లీలో 1,113, మహారాష్ట్రలో 762, బీహార్‌లో 584, మధ్యప్రదేశ్‌లో 514, హర్యానాలో 506, రాజస్థాన్‌లో 408, తమిళనాడులో 301, పశ్చిమ బెంగాల్‌లో 306, కర్ణాటకలో 305 ఫిర్యాదులు నమోదయ్యాయి. 2023లో 28,811 ఫిర్యాదులను ఎన్‌సిడబ్ల్యు రిజిస్టర్ చేసింది.

భద్రతా కేటగిరీలో లక్షన్నరకు పైగా ఖాళీలు

- ఆర్‌టిఐ కింద వెల్లడించిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ : భారతీయ రైల్వేలో భద్రతా కేటగిరీలో దాదాపు 10లక్షల పోస్టులు మంజూరవగా, ఈ ఏడాది మార్చి నాటికి లక్షన్నరకు పైగా పోస్టులు ఖాళీగా వున్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు తెలిపింది. భద్రతా కేటగిరీ పోస్టుల్లో రైలు డ్రైవర్లు, ఇన్‌స్పెక్టర్లు, క్రూ కంట్రోలర్లు, లోకో ఇన్‌స్ట్రక్టర్లు, ట్రెయిన్ కంట్రోలర్లు, ట్రాక్ మెయింటెనర్లు, స్టేషన్ మాస్టర్లు, పాయింట్స్‌మెన్, ఎలక్ట్రిక్ సిగ్నల్ మెయింటెనర్లు, సిగ్నలింగ్ సూపర్‌వైజర్లు తదితరులు వుంటారు. రైళ్ల రాకపోకల్లో ప్రత్యక్షంగా ప్రమేయమున్నందున ఈ పోస్టుల్లోని సిబ్బంది రైళ్ళ భద్రతకు చాలా కీలకం. మొత్తంగా 10,00,941 పోస్టులు మంజూరవగా, 8,48,207 పోస్టుల్లో పనిచేస్తున్నారు, మరో 1,52,734 పోస్టులు ఖాళీగా వున్నాయని ఆర్‌టిఐ సమాచారం పేర్కొంది. లోకో పైలట్ల పోస్టులు 70,093 మంజూరవగా, వాటిలో 14,429 పోస్టులు ఖాళీగా వున్నాయి. మధ్యప్రదేశ్‌కి చెందిన చంద్రశేఖర్ గౌర్ సమాచార హక్కు చట్టం కింద సమాధానం తెలియజేయాల్సిందిగా పిటిషన్ దాఖలు చేశారు. దానిపై రైల్వేస్ స్పందించింది. అసిస్టెంట్ డ్రైవర్ల ఖాళీలు కూడా వున్నాయని తెలిపారు. గత నాలుగేళ్లలో ఎన్ని పోస్టులు సృష్టించారు, ఎన్ని పోస్టులు భర్తీ చేశారనే వివరాలు కూడా వెల్లడించాలని కోరారు. సిబ్బంది కొరత కారణంగా భద్రతా కేటగిరీలోని సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైల్వే కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.

ప్రజ్వల్ లైంగిక వేధింపుల కేసులో భవాని రేవణ్ణకు బెయిల్

బెంగుళూరు : ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసులో అతని తల్లి భవాని రేవణ్ణకు కర్ణాటక హైకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసు బాధితుల్లో ఒకరిని కిడ్నాప్ చేశారన్న ఆరోపణలతో భవాని రేవణ్ణపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. భవానికి బెయిల్ మంజూరు చేసిన కోర్టు విచారణ కోసం ఆమెను హాసన్, మైసూర్ జిల్లాలకు తీసుకుని వెళ్లడానికి సిట్‌కు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ ఉత్తర్వులు జారీ చేశారు. వేడుకలు, ఊరేగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని భవాని రేవణ్ణను కోర్టు ఆదేశించింది.

పర్యావరణానికి పెను ముప్పు !

- గాజాలో ఇజ్రాయిల్ రాక్షసత్వంపై ఐరాస
- మరో శరణార్థి శిబిరంపై దాడి
- 17మంది పాలస్తీనీయుల మృతి

గాజా : నెలల తరబడి గాజాలో కొనసాగుతున్న రాక్షస దాడులు అక్కడి పర్యావరణానికి పెను ముప్పుగా పరిణమించాయని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘర్షణల వల్ల గాజా ప్రాంతంలో నేల, నీరు, గాలి తీవ్రంగా కలుషితమై పోయాయని తెలిపింది. పారిశుధ్య వ్యవస్థలన్నీ నాశనమయ్యాయని, నిత్యం కొనసాగుతున్న పేలుళ్లతో టన్నుల కొద్దీ శిథిలాలు పేరుకుపోయాయని వివరించింది. ఇజ్రాయిల్ సాగిస్తున్న రాక్షస దాడుల వల్ల పర్యావరణానికి వాటిల్లుతున్న నష్టంపై ఐక్యరాజ్య సమితి ఒకనివేదిక వెలువరించింది. గాజా ప్రాంతంలో ఉప్పు నీటిని మంచి నీటిగా మార్చడం, వృధా నీటి నిర్వహణకు ఏర్పాటు చేసిన సదుపాయాలన్నీ ఇజ్రాయిల్ దాడుల్లో ధ్వంసమయ్యాయని ఐరాస పర్యావరణ కార్యక్రమం ప్రాథమిక అధ్యయనంలో వెల్లడైంది. అలాగే గాజా తీరప్రాంత చిత్తడి నేలలు, సౌర విద్యుత్ రంగంలో పెట్టిన పెట్టుబడులన్నీ నాశనమయ్యాయని తెలిపింది. పేలుడు పదార్థాలు, ఆయుధాల వల్ల దాదాపు 3.9కోట్ల టన్నుల శిథిలాలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయని పేర్కొంది. గాజాలోని ప్రతి చదరపు మీటరు ప్రాంతంలోను 107కిలోల శిథిలాలు పడి వున్నాయని తెలిపింది. 2017లో ఇరాక్‌లోని మోసుల్ నగరంపై జరిగిన బాంబు దాడుల్లో పేరుకుపోయిన శిథిలాల కన్నా ఇవి ఐదు రెట్లు ఎక్కువని ఆ నివేదిక పేర్కొంది.

మృత్యు కోరల్లో 3500 మంది పిల్లలు

గాజా ప్రాంతంలోకి ఆహారం, మందులు, నీరు, విద్యుత్ సరఫరాలను ఇజ్రాయిల్ అడ్డుకోవడంతో 3,500 మంది చిన్నారులు మృత్యు కోరల్లో చిక్కుకున్నారు. మానవతా సాయం అందకుండా ఇజ్రాయిల్ క్రాసింగ్‌లను మూసివేయడంతో అంతర్జాతీయ సంస్థలు, ఇతర దేశాల నుండి వచ్చే ఆహారం, ఇతర సామాగ్రి గాజాకు అందడం లేదు. దీంతో పరిస్థితులు దుర్భరంగా తయారయ్యాయి. ఇదిలా ఉండగా గడచిన 24 గంటల్లో నుస్రత్ శరణార్థ శిబిరంపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 17మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో మహిళలు, పిల్లలు వున్నారు. సోమవారం రాత్రంగా ఈ దాడులు కొనసాగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రఫాలో ఆహార ట్రక్కుల కోసం వేచి చూస్తున్న వారిపై దాడులు జరగడంతో 9మంది పాలస్తీనియన్లు మరణించారని అధికారులు తెలిపారు. అనేకమంది గాయపడ్డారు. ఇప్పటివరకు గాజా దాడుల్లో 37,372 మంది మరణించగా, 85,452మంది గాయపడ్డారు.

(మొదటి పేజీ తరువాయి)

పిఎం కిసాన్ నిధులు విడుదల

విడతలుగా మొత్తం ఆరు వేల రూపాయలు అందజేస్తున్నారు. ఈ అరకొర సాయానికే ప్రభుత్వం పెద్ద ఎత్తున టామ్ టామ్ వేసుకుంటోంది. అదేదో కొత్త పథకమైనట్లు బిజెపి అనుకూల బాకాలు ప్రచారం చేస్తున్నాయి. ఇచ్చేది గోరంత...ప్రచారమేమో కొండంత.

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంటులో మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం కింద రైతులకు ఏటా మూడు విడతలుగా మొత్తం ఆరు వేల రూపాయలు సంబంధిత బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. ఇప్పటికే అలాంటి 16 వాయిదాలకు సంబంధించి చెల్లింపులు జరిగాయి.

తాజాగా మంగళవారం 17వ వాయిదా సొమ్మును బదిలీ చేశారు. ఇది రొటీన్‌గా జరిగే కార్యక్రమమే. సంబంధిత మంత్రిత్వ శాఖకు బడ్జెట్‌లో కేటాయించిన సొమ్ము నుండి రైతుల ఖాతాకు నేరుగా నగదును బదిలీ చేస్తారు. మంత్రిత్వ శాఖకు చెందిన సిబ్బంది ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేస్తారు. ఇదంతా యథావిధిగా జరిగే కార్యక్రమమే.

సంకీర్ణ ప్రభుత్వమనే వాస్తవాన్ని మరచి...

మోడీ తాను సంకీర్ణ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నానన్న విషయాన్ని మరచి ఎప్పటిలానే ఒంటెత్తు పోకడలు పోతున్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపి విడుదల చేసిన మ్యానిఫెస్టోకు 'మోడీ కా గ్యారంటీ' అని పేరు పెట్టిన విషయం తెలిసిందే. అందులో రైతుల కోసం కొత్తగా చేర్చిన కార్యక్రమం కానీ, పథకం కానీ ఏమీ లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని గతంలో ఇచ్చిన హామీని తాజా మ్యానిఫెస్టోలో కనీసం ప్రస్తావించనైనా లేదు. తమ ఉత్పత్తులకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలని, వాటికి చట్టబద్ధత ఇవ్వాలని రైతులు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నప్పటికీ బిజెపి మ్యానిఫెస్టో దానిపై మౌనం వహించింది. మోడీ ఎన్నికల ప్రచారంలో కూడా రైతు సమస్యలను పెద్దగా ప్రస్తావించలేదు.

ఇప్పుడూ అదే అరకొర సాయం

ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు అందజేస్తున్న సాయాన్ని పెంచుతారని అందరూ ఆశించారు. అయితే పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకోకుండా గత ఐదు సంవత్సరాలుగా అందజేస్తున్న సాయాన్నే ఇప్పుడూ కొనసాగిస్తున్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు రైతుకు ఏటా ఆరు వేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటే ప్రయోజనమేమీ ఉండబోదని పలువురు నిపుణులు అప్పుడే తేల్చి చెప్పారు. ఈ స్వల్ప మొత్తంతో రైతన్న ఆదాయంలో వచ్చే మార్పేమీ ఉండదు. అతని రుణభారమూ తీరదు. పైగా ఆ అరకొర సాయం కూడా భూ యజమానులకే అందుతుంది తప్పించి కౌలు రైతులకు దక్కేదేమీ ఉండదు.

సమస్యలకు పరిష్కారాలేవి?

వ్యవసాయం రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు నానాటికీ తగ్గిపోతున్నాయి. దేశ జనాభాలో 45 శాతం మందికి పైగా ప్రజలు తమ జీవనోపాధి కోసం ఇప్పటికీ వ్యవసాయం పైనే ఆధారపడుతున్నారు. వ్యవసాయ రంగం ప్రతి సంవత్సరం కొత్త కొత్త సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పులు అన్నదాతలకు శాపంగా మారుతున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా రైతుల ఇబ్బందులు చెప్పనలవి కావు. ప్రభుత్వం మాత్రం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి అనేక ప్రయత్నాలు చేస్తోంది. అరకొర సాయాన్ని అందిస్తూ దానినే ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటోంది. ఆందోళనలు, నిరసనల సందర్భంగా రైతులు లేవనెత్తిన పలు సమస్యలకు ఇప్పటికీ పరిష్కారం లభించలేదు. దీర్ఘకాలిక ఉద్యమాల కారణంగా వ్యవసాయ చట్టాలను ప్రభుత్వం ఉపసంహరించుకున్నప్పటికీ అనేక మౌలిక అంశాలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి. అన్ని పంటలకూ కనీస మద్దతు ధరలు, ఉత్పత్తుల సేకరణలో వికేంద్రీకరణ, వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచడం, పంట వైవిధ్యం, రుణ సదుపాయం, పంట బీమా, డబ్ల్యూటీఓ ఆంక్షలు, రసాయన ఎరువులు-క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించడం, మార్కెట్లలో ప్రవేశానికి అవరోధాలు తొలగించడం....ఇలా చెప్పుకుంటూ పోతే వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు సవాలక్ష. కులం, లింగం సహా భూ యాజమాన్య హక్కుల పంపిణీలో అసమానతలకు సంబంధించిన సమస్యను కనీసం ప్రస్తావించే వారు కూడా లేరు.

మహిళలను రైతులుగా గుర్తించరా?

స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జీలు) చెందిన 30 వేల మంది మహిళలకు పారా ఎక్స్‌టెన్షన్ వర్కర్లుగా పనిచేసేందుకు ప్రధాని వారణాసి పర్యటనలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వీరందరికీ ఇప్పటికే 'కృషి సఖులు'గా శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు వీరికి అతి తక్కువ ప్రతిఫలాన్ని చెల్లిస్తూ క్లిష్టమైన పనులు చేయించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వీరికి ఎలాంటి గుర్తింపు ఉండదు.

ఓ రకంగా చెప్పాలంటే వాలంటీర్ల వంటి వారు. అన్నదాతల కోసం ఉద్దేశించిన కార్యక్రమంలో కూడా మహిళలను వాలంటీర్లుగా తీసుకుంటున్నారే తప్పించి రైతులుగా కాదు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో 75 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు. అదే పురుషుల్లో 49 శాతం మందే ఈ రంగంలో ఉన్నారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే 63 శాతం మంది గ్రామీణ పురుషులు యజమాని హోదా పొందితే 52 శాతం మంది మహిళలు సహాయకులుగానే ఉండిపోతున్నారు. పురుషులతో సమానంగా...ఒక్కోసారి ఎక్కువగానే మహిళలు పొలంలో కష్టపడినప్పటికీ వారిని రైతులుగా గుర్తించడం లేదు. పిఎం-కిసాన్ పథకంలో సైతం మొత్తం లబ్దిదారుల్లో 25 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు.

భౌతిక స్వాధీనతా ప్రకటన

ICICI Bank

బ్రాంచ్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహల్లి హొసర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

ఏదైతే,
క్రింది సంతకందారులు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి.
రుణగ్రహీత బకాయి మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినకారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని దిగువ పేర్కొన్న తేదీలలో స్వాధీనం చేసుకొన్నారు. ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఏదేని లావాదేవీలు జరుపదలచిన వారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకులోబడి ఉంటుందని తెలియజేయనైనది.

క్ర. సం.	రుణగ్రహీత(ల) పేరు / రుణ ఖాతా నెంబర్	ఆస్తి వివరణ/ భౌతికంగా స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	దొడ్డపనేని శివనాగ చైతన్య/ దొడ్డపనేని శ్రీనివాసరావు/ LBTEN00005141859/ LBTEN00005143897	తెనాలి మున్సిపాలిటీ, గుంటూరు జిల్లా రిజిస్ట్రేషన్ పరిధిలోని ఖాళీ ఇంటి స్థలం యొక్క 47.89చ.గ.ల విస్తీర్ణం కవరుచేస్తున్న రుణ పత్రం/ ఆస్తి పత్రంలో వివరించినట్లుగా. సరిహద్దులు:ఉత్తరం:జెట్టి శివ రామయ్యకు చెందిన ఆస్తి, దక్షిణం: గోలి డొంక రోడ్డు, తూర్పు: 30 అ.ల వెడల్పు రోడ్డు, పడమర: ఈదర శాంత కుమారికు చెందిన ఆస్తి/ భౌతిక స్వాధీనతా తేది: 14-06-2024	13/07/2021 Rs. 28,14,349.00/-	తెనాలి

ఇందుమూలంగా పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా 30 రోజుల ప్రకటన ఇవ్వబడుతుంది, లేనిచో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తరువాత సదరు తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.
తేది: జూన్ 19, 2024
ప్రదేశం: తెనాలి & గుంటూరు
అధీకృత సంతకందారు
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(ఇంతకుముందు ఇక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడినది)
రిజిస్టర్డ్ కార్యాలయం: నెం.769, స్పెన్సర్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-2, అన్నాసాలై, చెన్నై-600002. # 044-42995000, 044-42995050

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)తో చదవగల సర్ఫేసి చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన
ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా సెక్యూర్డు క్రెడిటార్‌కు తాకట్టుపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని ఈక్విటస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనంలోకి తీసుకోబడినది, దిగువ రుణగ్రహీతల నుండి ఈక్విటస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు దిగువ పేర్కొన్న బకాయిల మొత్తాల రికవరీ కొరకు "ఎక్కడ ఎలా ఉన్నది మరియు అక్కడ అలాగే" ప్రతిపాదికన 24-07-2024న విక్రయించబడును.

రుణగ్రహీత(లు) / హామీదారు(ల) పేరు & చిరునామా, మొత్తం బకాయి + నుండి వడ్డీ	స్థిరాస్తి యొక్క వివరణ
1) శ్రీమతి కొసన లావణ్య భర్త వెంకటర మణికంఠ, టేకే బ్లాక్ ఫ్లాట్‌నెం.309, ఐజెఎం అపార్ట్‌మెంట్, కంతేరు నంబూరు రెయిన్ ట్రీపార్క్, గుంటూరు-522236, ఆం.ప్ర: ఇక్కడ కుడా: డోర్ నెం.2-3 కొత్తారెడ్డి పాలెం, చేబ్రోలు, గుంటూరు, ఆం.ప్ర-522212. 2) శ్రీ కొసన వెంకట మణికంఠ భర్త లావణ్య, టేకే బ్లాక్ ఫ్లాట్ నెం.309, ఐజెఎం అపార్ట్‌మెంట్, రెయిన్ ట్రీ పార్క్, కంతేరు నంబూర్ గుంటూరు-522236 ఆం.ప్ర. ఇక్కడా కుడా: డోర్ నెం.9-142/2, మున్నగివారిపల్లెం, టి.సుందర్, గుంటూరు, ఎ.పి.-522318. రుణ ఖాతా నెం: SEGNTUR0323381 క్లెయించేసిన మొత్తం బకాయి: 03.07.2023 నాటికి రూ.635533/-,నెలవారి వాయిదాలు, చార్జీలు & ఖర్చులతో 04.07.2023 నుండి తదుపరి వడ్డీతో. (బాకీపడిన మొత్తం 22-05-2024 నాటికి మొత్తం రూ.8,42,875.06/-).	ఐటం-1: నివాసిత ఇంటి పాతడోర్ నెం.1-68, కొత్త డోర్ నెం.13-65, పాత బ్లాక్ నెం.1, కొత్త బ్లాక్ నెం.13, అసెస్‌మెంట్ నంబర్:65, విస్తీర్ణం 230చ.గ.లు లేదా 193.2 చదరపు మీటర్లు, డోర్ నెం.401/5, పాతరెడ్డిపేలం శివారు, కొత్తారెడ్డిపేలం, పాత బ్లాక్ నెం.1, కొత్త బ్లాక్ నెం.13, ఎస్ఆర్ఓ చేబ్రోలు, గుంటూరు రిజిస్ట్రేషన్ జిల్లా. దిగువ సరిహద్దులు: ఉత్తరం: పంచాయతీ బజార్, దక్షిణం: కుంచాల శ్రీనివాసరావుఆస్తి సరిహద్దు, తూర్పు: అచ్చి ఆదినారాయణఆస్తి సరిహద్దు, పడమర: బండారుపల్లి సంబ్రాజ్యం ఆస్తి సరిహద్దు. కొలతలు: విస్తీర్ణం 230చ.గ.లు లేదా 193.2 చ.మీ.లతో గుంటూరులోని చేబ్రోలు మరియు రిజిస్ట్రేషన్ జిల్లా సబ్-రిజిస్ట్రేషన్ జిల్లాలో పరిధిలో ఉంది. భూమికి అనుసంధానించబడిన అన్ని భవనాలు మరియు నిర్మాణంతో పాటు, భూమికి జోడించబడిన దేనికైనా శాశ్వతంగా బిగించి, వర్తమానం మరియు భవిష్యత్తు మరియు అన్నిసులభ / మమూల్ హక్కులు దానికి జోడించబడ్డాయి. రిజర్వ్ ధర: రూ.4,35,000/- ధరావత్తు: రూ.43,500/- సంప్రదింపు పేర్లు: శ్రీ.ఆనంద ప్రసాద్: 9940009476 సాయి కాంత్: 7569656556

వేలం తేది: 24-07-2024
ఇ-వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి దిగువ ఇచ్చిన లింక్‌ను రిఫర్ చేయండి www.equitasbank.com & https://sarfaesi.auctiontiger.net
తేది : 19-06-2024, ప్రదేశం: చెన్నై
సం/- అధీకృత అధికారి, ఇక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, అన్నా సలై, సైదాపేట్, చెన్నై-600015, మరియు దీని బ్రాంచులో ఒకటైన: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 54-20-10/1ఏ, ఫ్లాట్ నెం.43, 3వ అంతస్తు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా, మెయిన్ రోడ్, గురునానక్ కాలనీ, విజయవాడ-520008, CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com

అనుబంధం-4 స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారుడు హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (చట్టం నెం.54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులు ముగిసన తరువాత దిగువ రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీతలు/హామీదారులు మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీత(ల)/ హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదవగల సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద వారికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకోవడమైనది. ప్రధానంగా రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలను జరపదలచిన వారు హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి దిగువ పేర్కొన్న డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై తదుపరి వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారుల పేరు/లాన్	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనతా తేది
1	1) శ్రీమతి రాణి కోతమసు..... రుణగ్రహీత 2) శ్రీ. ఓంకార్‌నాథ్ కోతమసు .....సహ-రుణగ్రహీత నివాసం: డోర్ నెం: 14-29-21, భూషణం వీధి, మోరిస్పేట, తెనాలి, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522201. LAN No.AP/VWD/IBPT/A000000063	07.03.2024 & రూ.35,14,647/- (రూపాయిలు ముప్పైఐదు లక్షల పద్నాలుగు వేల ఆరువందల నలభైఏడు మాత్రమే) 16.02.2024న వడ్డీతోసహా	14.06.2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): పాత అసెస్‌మెంట్ నెం.10204ఏ, కొత్త అసెస్‌మెంట్ నెం.70039, ప్రస్తుత అసెస్‌మెంట్ నెం.1073028422, పాత డోర్ నెం.8-9-23, కొత్త డోర్ నెం.8-9-23ఏ, ఎన్‌టిఎస్ నెం.216, మున్సిపల్ పాత వార్డు నెం. 13, ప్రస్తుత వార్డు నెం. 9, రెవెన్యూ వార్డ్ నం. 8, బ్లాక్ నెం. 9, వించ్‌పేట్, మహా లక్ష్మి టెంపుల్ స్ట్రీట్, విజయవాడ-1 టౌన్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోగల స్థలం యొక్క 63.91చ.గ.లు లేదా 53.43చ.మీ.ల విస్తీర్ణంలో నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్ & స్థలం మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: మహాలక్ష్మి దేవాలయం వీధి (మునిసిపల్ రోడ్), దక్షిణం: సోమి లక్ష్మమ్మకు చెందిన ఆస్తి, పడమర: ముత్యాల దుర్గారావుకు చెందిన ఆస్తి, ఉత్తరం: రాజు మరియు ఇతరులకు చెందిన ఆస్తి.		
2.	1) శ్రీ కానీ విశ్వనాథ్ మోపర్తి, ... రుణగ్రహీత 2) నాగశ్రీ మోపర్తి, ...సహ-రుణగ్రహీత నివాసం: డోర్ నెం.56-14-4, చెన్నుపాటి అప్పారావు వీధి, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆం.ప్ర-520010. LAN NO.AP/VWD/BENZ/A000000428 & AP/VWD/VJDA/A000000221	07.03.2024 & రూ.28,88,502/- (రూపాయిలు ఇరవైఎనిమిది లక్షల ఎనభైఎనిమిది వేల ఐదువందల రెండు మాత్రమే) 16.02.2024న వడ్డీతోసహా	14.06.2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి): 1వ ఐటం (స్థలం) : తాడిగడప గ్రామం మరియు పంచాయతీ, పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ పటమట అధికార పరిధిలోకి ఆర్‌ఎస్ నెం.92/1లోగల 328.85చ.గ.ల విస్తీర్ణపు సైట్‌యొక్క మొత్తం భాగం. స్థల సరిహద్దులు: తూర్పు: మేడసాని పార్వతమ్మకు చెందిన ఆస్తి, దక్షిణం: 5 అ.ల వెడల్పు మార్గం, పడమర: పంచాయతీ రోడ్డు, ఉత్తరం: తాతినేని రామమోహనరావుకు చెందిన ఆస్తి. పై నాలుగు సరిహద్దుల్లో 328.85చ.గ.ల విస్తీర్ణంలో 22 చ.గ.ల యొక్క అవిభక్త పేర్కొనబడని ఉమ్మడి వాటా మొత్తం. 2వ ఐటం (ఫ్లాట్): పైన పేర్కొన్న 1వ ఐటం మొత్తం సైట్‌లో "సద్గురు టవర్స్" పేరు మరియు శైలితో ఒక గ్రూప్ ఇల్లు నిర్మించబడింది, దీనిలో రెండవ అంతస్తులో ఫ్లాట్ నెం.202, డోర్ నెం.2-24-ఎస్, ఎఫ్2, అసెస్‌మెంట్ నెం.5401లో కలదు. సరిహద్దులు: ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు: లిఫ్ట్ మరియు ఉమ్మడి కారిడార్, దక్షిణం: ఫ్లాట్‌నెం.201, పడమర: ఒపెన్ టు స్కై, ఉత్తరం: ఒపెన్ టు స్కై, పై నాలుగు సరిహద్దులలో ఫ్లాట్ యొక్క ప్లింత్ ఏరియాలో 783 చ.అడుగులు, ఉమ్మడి ఏరియా90 చ.అ.ల మరియు గ్రౌండ్ ఫ్లోర్‌లో 80చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా.		

తేది: 19-06-2024, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

మీకోసం

బెండకాయ కూర చేయడానికి ముందు కట్ చేసిన ముక్కల మీద కాస్త నిమ్మరసం చల్లితే జిగురు ఉండదు.

జీవన సౌరభం

ఒక్క నిమిషంలో జీవితం ఏమీ మారదు. కానీ ఆ ఒక్క నిమిషం ఆలోచించి తీసుకున్న నిర్ణయం మాత్రం జీవితాన్ని మార్చేస్తుంది.

చిన్ని మనసులు

చిన్ని చిన్ని పాపలు
చిగురాకు బోసులు
లేత లేత బుగ్గలు
కందిపోయే మొగ్గలు
బడికి తప్పటడుగులు
నవ జీవన బాటలు
రామ చిలుక మాటలు
అనుకరించే యాసలు
అలవాటయ్యే బాసలు
బాల్య చేష్ట ఆటలు
బహు పసందు మాటలు
చిన్న చిన్ని మనసులు
మోస్తున్న పెద్ద పెద్ద బరువులు
కొలువు దీరిన బడులు
బడలో కొత్త కొత్త చదువులు
కోటి ఆశల కొలువులు

- పి.బక్కారెడ్డి
97053 15250.



దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న పిల్లి ఆడుకునేందుకు ఒక ఊలు బంతి కనిపిస్తుంది కదా! అయితే దాని దగ్గరకు వెళ్లే దారి మాత్రం గజిబిజిగా ఉంది. కాస్త మీరే ఆ పిల్లికి దారి చూపించరూ..

నేను గీసిన బొమ్మ

జి.జోష్‌కుమార్, 8వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గాంధిగ్రామ్, చోడవరం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అభాగ్యుల సేవలో ...

'విశ్రమించని కష్టం విజయాన్ని అందిస్తుంది. ఆ విజయం జీవితంలోని ఎన్నో కష్టాలను తీరుస్తుంది' దీనికి అక్షరాలా ప్రతిరూపం కన్నెపోటి జ్యోత్స్న. జీవితంలో ఎదురయ్యే ఆటంకాలు ఎటువైపు మలుపు తిప్పుతాయో ఎవ్వరికీ తెలియదు. ఊహ తెలిసిన మొదట్లోనే తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవటంతో బంధువులు ఆ చిన్నారిని ఓ ఆర్చరీ అకాడమీ గేటు వద్ద వదిలేశారు. చైల్డ్ డెవలప్‌మెంట్ కమిటీ (సిడబ్ల్యుసి) ప్రతినిధుల సూచన మేరకు ఆ అకాడమీ వారు పాపను అక్కున చేర్చుకున్నారు. అక్కడే జ్యోత్స్న విలువిద్యలో చక్కని ప్రావీణ్యం పొంది, ఎన్నో పోటీల్లో పాల్గొంది. జాతీయ విలు విద్య క్రీడాకారిణిగా ఎన్నో బహుమతులు సాధించింది. ఇప్పుడు తనను పెంచి పెద్ద చేసిన సంస్థలోనే అనేకమంది బాల బాలికల అభివృద్ధిని పర్యవేక్షించే బాధ్యతలు నిర్వహిస్తోంది.

ఏలూరుకు చెందిన కన్నెపోటి మాధవరావు, వసుంధర దంపతులకు జ్యోత్స్న 2002 జనవరి 12న జన్మించింది. ఆ తరువాత నాలుగేళ్లకు తండ్రి చనిపోయాడే. మరో నాలుగేళ్లకు తల్లి కూడా చనిపోయింది. దీంతో, ఆమెను సాకే వారెవరకూ లేకపోయారు. బంధువులు కొందరు ఆ చిన్నారిని విజయవాడలోని ఓల్గా ఆర్చరీ అకాడమీ వద్ద విడిచి పెట్టారు. ఆ సంస్థ నిర్వాహకులు ఆ పాపను చేరదీసి, బాలల అభివృద్ధి సంస్థకు సమాచారం ఇచ్చారు. అప్పటినుంచి జ్యోత్స్న ఆలనా పాలనా ఆ సంస్థే చూసింది. ఆర్చరీ అంటే తనకు ఇష్టమని తెలుసుకుని మూడో తరగతి నుంచే నేర్చుకునేందుకు అవకాశం కల్పించారు. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు ఆర్చరీలో ఆమె రాణిస్తున్న విషయాన్ని గుర్తించిన ప్రతినిధులు ఆమెకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చారు. ఆ తర్వాత చదువు నిమిత్తం సిడబ్ల్యుసి సూచన మేరకు నవజీవన్ బాలభవన్‌లో చేరాల్సి వచ్చింది. విలువిద్యలో రాణించిన జ్యోత్స్న 2014లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా పతకాన్ని అందుకుంది. ఇప్పటివరకూ 26 జాతీయ బంగారు, వెండి పతకాలను ఆమె సాధించింది.

ఆమె విల్లు పట్టిందంటే గురి తప్పదు. ఆర్చరీ క్రీడలో రాష్ట్ర, దేశస్థాయిలో తన ప్రతిభను చాటింది. విలువిద్య నేర్చుకోవడం ఎంతో ఖరీదైన వ్యాపకం. జ్యోత్స్న ఆసక్తిని, లక్ష్యాన్ని నవజీవన్ ప్రతినిధులు నిరంతరంగా ప్రోత్సహించారు. ఆర్థిక ఇబ్బందులు ఆర్చరీకి ఆటంకం కాకూడదని ఆమెలో ధైర్యాన్ని నింపారు. "నువ్వు నీ ఆటపై కేంద్రీకరించు.. మిగతాది మేము చూసుకుంటా"మంటూ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె విలువిద్యలో నిరంతర సాధన చేసి, ఎన్నో విజయాలు సాధించింది. శిక్షకుల సలహాలను పాటిస్తూ గొప్ప విలువిద్య క్రీడాకారిణిగా రాణించింది. ఆమె విజయానికి నవజీవన్ బాలభవన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ గోళ్లమూడి శేఖర్‌బాబు నిరంతరం సహకారాన్ని అందించారు.

నవంబర్ 20న ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లల హక్కులపై అవగాహన కల్పించేందుకు జ్యోత్స్న ఒకరోజు మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా సభ్యులుగా విధులు నిర్వహించారు. అప్పటి చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ సమక్షంలో ఈ బాధ్యత నెరవేర్చింది. 'పిల్లల కోసం, పిల్లల యొక్క, పిల్లల చేత' అనే ఇతివృత్తంతో యునిసెఫ్, మహిళా ఆర్గనైజేషన్, అలయన్స్ ఫర్ చిల్డ్రన్ రైట్స్, మహిళా కమిషన్ ఆధ్వర్యంలో కిశోర బాలికలు నైని సుచరిత, కె.ఎస్తేరురాణి, ఎ.సిరివెన్నెల ఒకరోజు సభ్యులుగా వ్యవహరించారు.

జాతీయ విలువిద్య క్రీడాకారిణి కావటంతో జ్యోత్స్న ప్రయత్నిస్తే ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం కచ్చితంగా వస్తుంది. కానీ తన లాంటి బాలబాలికల జీవితాల్లో వెలుగులు నింపాలనే సదాశయంతో 2022లో డిగ్రీ పూర్తయిన వెంటనే చిగురు బాలికల పాఠశాలకు ఇన్‌ఛార్జిగా చేరింది జ్యోత్స్న. ఆసక్తి ఉన్న విద్యార్థులకు క్రీడాంశాల్లో ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందిస్తోంది. అమ్మానాన్నలు లేని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దటంలో తన వంతు పాత్ర నిర్వహిస్తోంది.

- యడవల్లి శ్రీనివాసరావు

జ్యోత్స్న విలువిద్యా వెలుగులు

2014-15లో 7వ ఆర్చరీ మినీ జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్
2015-16లో 8వ ఆర్చరీ మినీ జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌లో రెండు గోల్డ్‌మెడల్స్
2016లో 9వ ఆర్చరీ మినీ జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌లో రెండు గోల్డ్‌మెడల్స్
అదే ఏడాది 35వ సబ్ జూనియర్ ఆర్చరీలో సిల్వర్ మెడల్
2015-16లో 36వ సబ్ జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిఫ్‌లో సిల్వర్‌మెడల్
అదే ఏడాది మినీ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో సిల్వర్‌మెడల్
37వ సబ్ జూనియర్ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిఫ్‌లో సిల్వర్ మెడల్
2019-20లో 64వ నేషనల్ స్కూల్‌గేమ్స్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో సిల్వర్‌మెడల్
అదే ఏడాది నిర్వహించిన 65వ జాతీయస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్
36వ సబ్ జూనియర్ ఆర్చరీ చాంపియన్‌లో ద్వితీయ బహుమతి బ్రౌంజ్‌మెడల్
35వ నేషనల్ స్కూల్ గేమ్స్ 2015 కేరళలో టీమ్‌కు బ్రౌంజ్ మెడల్
ఫస్ట్‌కెలో ఇండియా స్కూల్ గేమ్స్ చాంపియన్
2014లో రాష్ట్రపతి అవార్డు విజేత
2021 నవంబరులో ఒకరోజు మహిళా కమిషన్ ఛైర్మన్ బాధ్యతల నిర్వహణ

కఠోర సాధనతో పతకాలు సాధించా

చిన్న వయసులోనే తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. బంధువులు ఒక ఆర్చరీ అకాడమీలో వదిలేసి వెళ్లిపోయారు. అక్కడే ఉంటూ ఆర్చరీ ఆడుతూ 8 ఏళ్ల వయసులో నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని 3 మెడల్స్ సాధించా. విశ్వభారతి స్కూల్‌లో చదువుకుంటూ ఆర్చరీలో నేషనల్స్‌లో ప్రాక్టీస్ చేశా. అప్పటి నుండి ఆ సంస్థే నన్ను పెంచింది. అక్కడ ఉంటూనే చదువుకుంటూ ఆర్చరీ ప్రాక్టీస్ చేస్తూ 2014లో నేషనల్ ఆర్చరీలో హ్యాట్రిక్ ఛాంపియన్‌గా నిలిచి ప్రెసిడెంట్ అవార్డు ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నాను. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఇక్కడ ఉండే పూర్తిచేశాను. ఆ సంస్థ వారే నా చదువు పూర్తయ్యాక గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతంలోని 'చిగురు' పాఠశాలకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు.

- కె.జ్యోత్స్న, జాతీయ విలు విద్య క్రీడాకారిణి

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారం

ప్రజలపై పడకుండా చర్యలు తీసుకోండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రూ.7,200 కోట్ల విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారాన్ని వినియోగదారులపై పడకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి మంగళవారం లేఖ రాశారు. ఇప్పటి వరకు హైదరాబాద్ నుంచి జరిగే విద్యుత్ నియంత్రణ మండలి విచారణను కర్నూలుకు మార్చడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కర్నూలులో జరిగే విచారణకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు పాల్గొనే అవకాశం లేదని తెలిపారు. భౌతిక విచారణతో పాటు ఆన్‌లైన్‌లో కూడా విచారణ జరపాలని కోరారు. విచారణను పూర్తిగా పారదర్శకతతో నిర్వహించాలన్నారు. ప్రజలు, ప్రజా సంఘాలు కూడా భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎపి జెన్‌కో ఇంధన వ్యయ ఛార్జీల ప్రతిపాదనలకు సంబంధించి బహిరంగ విచారణ జరపనందున రూ.1,992 కోట్లను ఆమోదించవద్దని డిమాండ్ చేశారు. అలాగే హిందూజా నేషనల్ పవర్ కార్పొరేషన్‌కు సంబంధించిన అదనపు మూల వ్యయం కూడా పెండింగ్‌లో వున్నందున దానిపై బహిరంగ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన ట్రూ అప్ ఛార్జీల్లో హిందూజాకు చెందిన రూ.1,234 కోట్లు వుందన్నారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

మానవ హక్కులను రాజకీయం చేయొద్దు

- ఇయు చర్యలపై చైనా

బీజింగ్ : మానవ హక్కుల అంశాలను రాజకీయం చేస్తూ, వాటిపై ద్వంద్వ ప్రమాణాలు అనుసరిస్తున్నారంటూ యురోపియన్ యూనియన్ (ఇయు) చర్యలను చైనా తీవ్రంగా నిరసించింది. చైనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి మానవ హక్కుల అంశాలను ఉపయోగిస్తున్నారని విమర్శించింది. యురోపియన్ యూనియన్‌తో పరస్పర మార్పిడుల ద్వారా పరస్పర పురోగతి సాధించగలమన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. తద్వారా అంతర్జాతీయ మానవ హక్కుల పాలనకు సంబంధించి సానుకూల సహకారం అందించగలరని ఆశిస్తున్నట్లు చైనా విదేశాంగ సహాయ మంత్రి మియో డెయూ చెప్పారు. బీజింగ్‌లో సోమవారం ఇయు అధికారులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. చైనా మానవ హక్కుల సూత్రాలు, సిద్ధాంతాలను ఈ సమావేశంలో ఆయన సమగ్రంగా వివరించారు. ప్రజల ప్రాథమిక ప్రయోజనాలనునెరవేర్చేందుకు ప్రజలకు హృదయపూర్వకంగా సేవ చేయాలన్నదే చైనా కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రజానుకూల విధానాలకు చైనా కట్టుబడి వుందని చెప్పారు. ప్రజలకు సంతోషకరమైన జీవితాన్ని అందించడమే అత్యంత గొప్పదైన మానవ హక్కని వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా వుండేలా, దేశ కాలమాన పరిస్థితులకు అనువుగా వుండేలా మానవ హక్కుల పంథాను అభివృద్ధిపరిచిందని చెప్పారు. మానవ హక్కులకు సంబంధించి చారిత్రక విజయాలు సాధించామన్నారు. చైనా తరహా ఆధునీకరణ ద్వారా చైనా పునరుజ్జీవనాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అంతర్జాతీయంగా మానవ హక్కులకు సంబంధించి చర్చలు, సహకారం వంటి అంశాల్లో చైనా చురుకుగా పాల్గొంటోందని చెప్పారు. అంతర్జాతీయ మానవ హక్కులను ఆరోగ్యకరంగా అభివృద్ధి పరచడంలో చైనా ముందుంటుందన్నారు. చైనా తరహా ఆధునీకరణ వల్ల చైనాలో మానవ హక్కుల పరిరక్షణ మరింత పటిష్టపడుతుందన్నారు.

నీట్ అక్రమాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో అత్యున్నత వైద్యవిద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకోవడం సరైందికాదని, తక్షణం నీట్ అక్రమాలపై జ్యుడీషియల్ విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక ముఠా రూ.30 లక్షలకు నీట్ ప్రశ్నాపత్రాన్ని అమ్మారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నీట్‌లో 720కి 720 మార్కులు 67మందికి రావడం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. హర్యానా రాష్ట్రంలోని ఒక పరీక్షా హాల్‌లో రాసిన ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు వచ్చాయన్నారు. ఈ అక్రమాలకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

5 లక్షల మంది వలసవాసులకు పౌరసత్వం

- ఎన్నికల ముంగిట బైడెన్ కొత్త ప్రణాళిక

వాషింగ్టన్ : ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో అమెరికాలోని వలసవాసులను ఆకట్టుకోడానికి బైడెన్ ప్రభుత్వ ఓ కొత్త ప్రణాళికను తీసుకొచ్చింది. ఎలాంటి చట్టబద్ధమైన ప్రతిపత్తి లేకుండా అమెరికాలో నివసిస్తున్న కుటుంబాల్లో భర్తకు పౌరసత్వం ఉండి భార్యకు లభించకపోయినా, లేదా భార్యకు పౌరసత్వం ఉండి భర్తకు లేకపోయినా ఇప్పుడు వారు శాశ్వత పౌరసత్వం పొందేందుకు ఈ ప్రణాళిక వీలు కల్పిస్తుంది. దీనివల్ల దాదాపు 5 లక్షల మందికి ప్రయోజనం చేకూరవచ్చని భావిస్తున్నారు. అయితే దీనికి షరతులు వర్తిస్తాయి. దరఖాస్తు చేసుకోవడానికి అర్హత పొందాలంటే ఇమ్మిగ్రెంట్ జూన్ 17నాటికి అమెరికాలో పదేళ్లపాటు నివసించి వుండాలి. అమెరికన్ పౌరులను వివాహం చేసుకుని వుండాలి. ఇమ్మిగ్రెంట్ పెట్టుకున్న దరఖాస్తును ఆమోదించినట్లైతే ఆ వ్యక్తి గ్రీన్ కార్డు కోసం మూడేళ్లలోగా దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుంది. తర్వాత తాత్కాలికంగా వర్క్ పర్మిట్ వస్తుంది. ఈలోగా వారిని అమెరికా నుండి పంపకుండా రక్షణ కల్పించబడుతుంది. అమెరికా పౌరులు కాని పిల్లలు కూడా 50వేల మంది వున్నారు. వీరికి కూడా ఇదే ప్రక్రియ అనుసరిస్తారు. జూన్ 17వ తేదీ తర్వాత పదేళ్లు దాటినా వారు ఈ ప్రోగ్రామ్ కింద అర్హత సాధించరని అధికారులు స్పష్టం చేశారు. ఈ వేసవి చివరి నాటికల్లా దరఖాస్తులు పెట్టుకునే ప్రక్రియ ప్రారంభమవుతుందని సీనియర్ అధికారులు తెలిపారు.

సిరిమానోత్సవంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ఎచ్చెర్ల (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన సిరిమానోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఇద్దరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... కుప్పిలి గ్రామంలో గ్రామ దేవతలైన అసిరితల్లి, బంగారమ్మతల్లి పండుగలో భాగంగా సిరిమాను ఊరేగించారు. సిరిమాను ఒక్కసారిగా విరిగిపోవడంతో దీనిపై కూర్చున్న పూజారి ఒక్కసారిగా కింద ఉన్న వారిపై పడ్డారు. ఈ ఘటనలో కారి పల్లేటి (55), సురాడ అప్పన్న (40)లకు తీవ్రగాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పూజారికి తీవ్ర గాయాలయ్యాయి.

అందరి దృష్టి అమెరికాపైనే..

- నేడు దక్షిణాఫ్రికాతో తొలి సూపర్-8 మ్యాచ్
- రాత్రి 8.00గం॥లకు

ఆంటిగ్వా: ఐసిసి టి20 ప్రపంచకప్ గ్రూప్ లీగ్ పోటీలు ముగిసాయి. లీగ్ దశ పోటీలు ముగిసిన అనంతరం ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన 8జట్ల మధ్య సూపర్-8 సమరం బుధ వారం నుంచి ప్రారంభం కానుంది. సూపర్-8లో ప్రతి జట్టు ఆ గ్రూప్‌లో మూడేసి మ్యాచ్‌లు చొప్పున ఆడనుంది. మూడు మ్యాచ్‌లు ముగిసిన అనంతరం ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన రెండు జట్లు సెమీస్‌ఫైనల్‌కు చేరనున్నాయి. ఈ మెగా టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లోనే పాకిస్తాన్‌కు ఝలక్ ఇచ్చి అమెరికా సూపర్-8కు చేరగా.. మరో ఆతిథ్య జట్టు వెస్టిండీస్ కూడా గ్రూప్-సిలో నాలుగు వరుస విజయాలతో అగ్రస్థానంలో నిలిచి సూపర్-8కు చేరింది. ఈ క్రమంలో అమెరికా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఆంటిగ్వా వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో సూపర్-8 సంగ్రామం మొదలు కానుంది. గ్రూప్-1లో భారత్, ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్... గ్రూప్-2లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, అమెరికా జట్లు ఉన్నాయి.

పూరన్ మెరుపు ఇన్నింగ్స్..

గ్రూప్-సి ఆఖరి లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 104పరుగుల తేడాతో ఆఫ్ఘనిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. సోమవారం రాత్రి జరిగిన నామమాత్రపు గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో నికోలస్ పూరన్(98; 53బంతుల్లో 6ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 218పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. పూరన్‌కి తోడు ఛార్లెస్(43), హోప్(25), పావెల్(26) బ్యాటింగ్‌లో రాణించారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లు గులాబుద్దీన్‌కు రెండు, నవీన్-ఉల్-హక్, అజ్మతుల్లాకు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆఫ్ఘన్ జట్టు 16.2ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. జద్రాన్(38), ఒమర్జాయ్ (23) టాప్ స్కోరర్స్. విండీస్ బౌలర్లు మెక్ కొయ్‌కు మూడు, మోటీ, హొసైన్‌కు రెండేసి వికెట్లు దక్కా యి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పూరన్‌కు లభించింది. దీంతో గ్రూప్-సిలో వెస్టిండీస్ జట్టు వరుసగా నాలుగు మ్యాచుల్లో విజయాలను నమోదు చేసుకొని 8పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది.

మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం

టి20 ప్రపంచ కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ ఉదంతం తెరపైకి వచ్చింది. మ్యాచ్ ఫిక్సింగ్ కోసం కెన్యా మాజీ క్రికెటర్ ఉగాండా జట్టు ఆటగాడిని సంప్రదించగా.. ఈ విషయాన్ని ఉగాండా ఆటగాడు వెంటనే ఐసిసి అవినీతి నిరోధక విభాగానికి తెలియజేసినట్లు సమాచారం. గయానా వేదికగా ఉగాండా మూడు లీగ్ దశ మ్యాచ్‌లు ఆడింది. ఆ సందర్భంగా కెన్యా మాజీ పేసర్ మ్యాచ్ ఫిక్సింగ్ కోసం పలుమార్లు వేర్వేరు నంబర్లతో ఉగాండా ప్లేయర్‌ను సంప్రదించడానికి ప్రయత్నించాడట. ఈ విషయాన్ని సదరు ప్లేయర్ ఐసీసీ అవినీతి నిరోధక బందం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారణ చేపడతామని ఐసిసి తెలిపినట్లు సమాచారం. గ్రూప్-సిలో ఉన్న ఉగాండా.. నాలుగు మ్యాచ్‌లు ఆడి ఒక దాంట్లో విజయం సాధించింది.

లీగ్ పోటీలు ముగిసిన అనంతరం పాయింట్ల పట్టిక

	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
గ్రూప్-ఎ						
ఇండియా	4	3	0	1	7	+1.13
అమెరికా	4	2	1	1	5	+0.12
పాకిస్తాన్	4	2	2	0	4	+0.29
కెనడా	4	1	2	1	3	-0.49
ఐర్లాండ్	4	0	3	1	1	-0.59
గ్రూప్-బి						
ఆస్ట్రేలియా	4	4	0	0	8	+2.79
ఇంగ్లండ్	4	2	1	1	5	+3.61
స్కాట్లాండ్	4	2	1	1	5	+1.25
నమీబియా	4	1	3	0	2	-2.52
ఓమన్	4	0	4	0	0	-3.06
గ్రూప్-సి						
వెస్టిండీస్	4	4	0	0	8	+3.25
ఆఫ్ఘనిస్తాన్	4	3	1	0	6	+1.83
న్యూజిలాండ్	4	2	2	0	4	-0.41
ఉగాండా	4	1	3	0	2	-4.51
పపువ్యుగియా	4	0	4	0	0	-1.26
గ్రూప్-డి						
దక్షిణాఫ్రికా	4	4	0	0	8	+0.47
బంగ్లాదేశ్	4	3	1	0	6	+0.61
శ్రీలంక	4	1	2	1	3	-0.86
నెదర్లాండ్స్	4	1	3	0	2	-1.35
నేపాల్	4	0	3	1	1	-0.54

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

ఒలింపిక్స్‌కు భారత షార్ట్ గన్ జట్టు ఇదే : ఎన్‌ఆర్‌ఎఐ

పృథ్విరాజ్

న్యూఢిల్లీ: 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే భారత షార్ట్ గన్ జట్టు బృందాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఆర్‌ఎఐ) ప్రకటించింది. ఎన్‌ఆర్‌ఎఐ మంగళవారం ప్రకటించిన పురుషుల షార్ట్‌గన్ బృందానికి పృథ్విరాజ్ థొండిమాన్, మహిళల బృందానికి రాజేశ్వరి కుమారి సారథ్యం వహించనున్నారు. పురుషుల, మహిళల బృందం మొత్తం ఐదు విభాగాల్లో పతకాలకు పోటీపడనున్నారు. పురుషుల స్కీట్‌లో అమన్‌జీత్, మహిళల స్కీట్ విభాగాల్లో రిజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ పతకాలకు పోటీపడనున్నారు. ఇక మహేశ్వరి, అమన్‌జీత్ బృందం స్కీట్ మిక్స్‌డ్ టీం విభాగంలో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

షార్ట్‌గన్ జాబితా: పురుషుల ట్రాప్ : పృథ్విరాజ్ థొండిమాన్, మహిళల ట్రాప్ : రాజేశ్వరి కుమారి, పురుషుల స్కీట్ : అమన్‌జీత్ సింగ్, మహిళల స్కీట్ : రిజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్, స్కీట్ మిక్స్‌డ్ టీమ్ : అమన్‌జీత్ సింగ్, మహేశ్వరి చౌహాన్

ఇంటర్వ్యూలకు హాజరైన గంభీర్, రామన్

ముంబయి: పురుషుల క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ పదవికి జరిగిన ఇంటర్వ్యూలకు టీమిండియా మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్, డబ్ల్యువి. రామన్ హాజరయ్యారు. క్రికెట్ అడ్వైజరీ కమిటీ(సిఎసి) మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు వీరు హాజరయ్యారు. ఐసిసి టి20 ప్రపంచకప్ ముగిసిన అనంతరం టీమిండియా కోచ్ రాహుల్ ద్రావిడ్ పదవీకాలం ముగియనుండడంతో మాజీ క్రికెటర్ అశోక్ మల్హోత్రా నేతృత్వంలోని సిఎసి కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గౌతమ్ గంభీర్ ప్రత్యక్షంగా ఇంటర్వ్యూకు హాజరుకాగా.. భారత మహిళల జట్టు బ్రాడ్‌కాస్టర్‌గా ఉన్న డబ్ల్యువి రామన్ బెంగళూరునుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మల్హోత్రాతోపాటు సులక్షణ నాయక్, జతిన్ పరాంజపే సిఎసి కమిటీ సభ్యులుగా ఉన్నారు. ప్రధాన కోచ్ పదవి రేసులో గౌతమ్ గంభీర్ పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68